
మాగుంట సుబ్బరామ రెడ్డి

నిష్పక్షపాతం.. సత్యనిష్ఠ..
అంకితభావం..
ప్రజల మేలు కోసం చూపే తెగువ
పత్రికలకు అవశ్యం.



# ఆంధ్రపత్రిక

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన ఏకైక దినపత్రిక - స్థాపితం 1914

విజయవాడ సంపుటి : 60 సంచిక : 247 • పేజీలు : 8 • గురువారం 30 మే 2024 • వెల : రూ. 5.00

Published from : Vijayawada| Visakhapatnam |Srikakulam | Rajahmundry|Kurnool|Guntur|Ongole| Nellore Tirupati


# ఎన్నికల్లో బిజెపిదే విజయం

- బెంగాల్లో బిజెపి అనూహ్యస్పందన లభిస్తోంది
- మళ్లీ కేంద్రంలో మోదీ ప్రభుత్వమే వస్తోంది..
- కనీవినీ ఎరుగనంతగా బీజేపీకి ప్రజల మద్దతు
- స్పందన చూస్తుంటే మీ ఆశీస్సులు నావెంటే ఉన్నాయని బలంగా నమ్ముతున్నాను..
- బుజ్జగింపు రాజకీయాల కోసం తృణమూల్ కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగంపై దాడి
- జూన్ 1న వికసిత్ బెంగాల్‌కు ప్రజల ఓట్లే కీలకం
- చొరబాటుదారులకు ఇక్కడ సుస్థిరస్థానం కల్పించాలనే ఆలోచనే ఇందుకు కారణం
- వికసిత భారత్..వికసిత బెంగాల్ కూడా ముఖ్యమే





## చివరి ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి

**కోల్‌కతా,మే 29 :** పశ్చిమబెంగాల్ వ్యాప్తంగా ఈ సారి కనీవినీ ఎరుగనంతగా బీజేపీకి ప్రజల మద్దతు కనిపిస్తోందని, ప్రజల ఆదరణ అనూహ్యంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మరోసారి మోదీ సర్కార్ వస్తుంది‘ అనే స్పష్టమైన సందేశాన్ని ప్రజలు ఇచ్చారని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని మధురాపూర్ బుధవారం నాడు జరిగిన భారీ బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ, కోల్‌కతాలో జరిపిన మిగతా 7లో

# హైదరాబాద్ చేరుకున్న చంద్రబాబు

- చంద్రబాబుకు స్వాగతం పలికిన టిడిపి శ్రేణులు
- కౌంటింగ్ నిర్వహణపై నేతలతో టెలికాన్ఫరెన్స్





**అమరావతి,మే 29 (ఆంధ్రపత్రిక):** విదేశి పర్యటన ముగించుకుని చంద్రబాబు నాయుడు హైదరాబాద్ చేరుకున్నారు. ఆయనకు శంషాబాద్ విమానాశ్ర యంలో టిడిపి శ్రేణులు స్వాగతం పలికారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల పోలింగ్ తర్వాత సైలెంట్‌గా ఉన్న టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబు తొలిసారి స్పందించారు. ఫలితాలు మిగతా 7లో

# కేజ్రీవాల్‌కు సుప్రీంలో చుక్కెదురు

- మధ్యంతర బెయిల్ పొడిగింపునకు నో
- 2న యథావిధిగా లొంగిపోవాలని ఆదేశం



**న్యూఢిల్లీ, మే 29 :** ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు నుంచి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మధ్యంతర మిగతా 7లో

# చైనాలో కొత్త వైరస్

**చైనా,మే 29 :** సుమారు మూడు సంవత్సరాల పాటు ప్రపంచం మొత్తాన్నీ గడగడలాడించిన ప్రాణాంతక కరోనా వైరస్‌కు జన్మనిచ్చిన చైనాలో మరో కొత్త వైరస్ పుట్టుకొచ్చింది. కోవిడ్ కంటే మహా ప్రమాదకరమైన వైరస్ ఇది. ల్యాబొరేటరీలో చైనా సైంటిస్టులు తమ స్వహస్తాలతో దీనికి ప్రాణం పోయడం ప్రాధాన్యతను మిగతా 7లో



# కేరళలోకి నైరుతి ఆగమనం..

- నాలుగైదు రోజుల్లో తెలుగు రాష్ట్రాలకు విస్తరణ

**న్యూఢిల్లీ,మే 29 :** ఈశాన్య రాష్ట్రాల్లో రెమాల్ తుపాను బీభత్సం సృష్టించగా.. ఉత్తరాది రాష్ట్రాలను మండుటెండలు వణికిస్తున్నాయి. ఇటు తెలుగు రాష్ట్రాల్లోనూ మళ్లీ ఎండలు దంచికొడుతున్నాయి. ఈ క్రమంలో మిగతా 7లో



# మోదీ పాలనలో ఉపాధి కరువు..!

- దేశ సంపద ఆ బిలియనీర్ల చేతుల్లోనే..
- కోటీశ్వరులను బలోపేతం చేయడమమే బీజేపీ లక్ష్యం
- కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ



**కులు,మే 29 :** ప్రధాని మోదీ తన పాలనలో ఉపాధి కల్పనను పట్టించుకోలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఆరోపించారు. లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా హిమాచల్ ప్రదేశ్‌లోని కులులో మిగతా 7లో

# ఢిల్లీకి తాగునీటి కష్టాలు



- నీటిని వృథా చేస్తే రూ.2000 జరిమానా
- ఢిల్లీ సర్కార్ కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ,మే 29 :** దేశ రాజధాని ఢిల్లీలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. గత కొద్ది రోజులుగా భారీగా ఉష్ణోగ్రతలు మిగతా 7లో

# పిల్లల అమ్మకాలపై దర్యాప్తు ముమ్మరం

- ఇతర రాష్ట్రాల్లో మూలాలపై కూపీ..
- పిల్లలను వదిలి ఉండలేమంటూ బాధితులు రోదన

**హైదరాబాద్,మే 29 (ఆంధ్రపత్రిక):** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన చైల్డ్ ట్రాఫికింగ్ ముఠా యాక్టివిటీస్ రాష్ట్రాల్లో కూడా ఉన్నట్టు పోలీసుసు అనుమానిస్తున్నారు. ఆ దిశగా రాచకొండ పోలీసులు దర్యా ప్తు ముమ్మరం చేస్తున్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇంకా ఏ యే రాష్ట్రాల్లో ఈ ముఠా కార్యక లాపాలు చేపట్టిందో ఆరా తీస్తు న్నారు. ప్రస్తుతానికి ఓ బృందం ఢిల్లీ వెళ్లినట్టు తెలుస్తోంది. చైల్డ్ మిగతా 7లో





# పోస్టల్ బ్యాలెట్‌పై సడలింపు

- ఏపీలోనే ఈసీ ప్రత్యేక రూల్స్ ఎందుకూ?
- హైకోర్టులో అప్పీల్ చేస్తామన్న వైవి



# కూటమిదే విజయం

- టిడిపితోనే బడుగు బలహీన వర్గాలకు న్యాయం..
- జగన్ పాలనలో బెదిరించడం, కేసులుపెట్టి వేధించడం..
- ఎంపి రామ్మోహన్ నాయుడు భరోసా

**అమరావతి, మే 29 (ఆంధ్రపత్రిక):** సమాజమే దేవాలయం... ప్రజలే దేవుళ్ళు అనే సిద్ధాంతంతో టీడీపీ పనిచేస్తుందని టిడిపి మిగతా 7లో

# ఎపి ఎన్నికల కౌంటింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు






- కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు..
- భారీగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్న ఎన్నికల సంఘం
- ఫలితాలను ఎప్పటికప్పుడు ప్రకటించేలా చర్యలు
- మద్యం దుకాణాల మూసివేత..విజయోత్సవాలు నిషేధం

**అమరావతి, మే 29 (ఆంధ్రపత్రిక):** ఎపిలో నెల కొన్న తాజా పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం కౌంటింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నది. భద్రతాబలగాలను రంగంలోకి దింపుతోంది. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ కావడంతో కౌంటింగ్ కేంద్రాల మిగతా 7లో

# వైసిపి ఏజెంట్లకు సజ్జల హెచ్చరికలు



- కౌంటింగ్ కేంద్రాల్లో అప్రమత్తంగా ఉండాలి
- ఖచ్చితంగా మళ్లీ అధికారంలోకి వస్తున్నాం..
- 9న యథావిధిగా జగన్ ప్రమాణం ఉంటుందని వెల్లడి

**అమరావతి, మే 29 (ఆంధ్రపత్రిక):** ఎన్నికల కమిషన్ రూల్స్ ప్రకారం కౌంటింగ్ సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని కౌంటింగ్ ఏజెంట్లకు వైకాపా ప్రధాన మిగతా 7లో

# ఈ సారీ బ్యాంకు ఖాతాల్లోనే

- ఏపీలో పింఛన్ల సొమ్ము విడుదల చేసినట్టు ప్రకటన విడుదల
- జూన్ ఒకటి నుంచి 5 వరకు పింఛన్ల పంపిణీ..
- ఇంటింటికీ వెళ్లి 17,56,105 మంది లబ్ధిదారులకు పంపిణీ
- ఎన్నికల నియమావళిని పాటిస్తూ పింఛన్ల పంపిణీ చేయాలి
- ఇప్పుడూ అదే విధానాన్ని కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయం



**అమరావతి, మే 29 (ఆంధ్రపత్రిక):** జూన్ నెలకు సంబంధించి సామాజిక భద్రతా పింఛన్ల సొమ్ము ను విడుదల చేసినట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. 65,30,808 మంది పెన్షనర్లకు రూ.1,939.35 కోట్ల రూపాయలు విడుదల చేసినట్టు గ్రామీణాభివృద్ధి మిగతా 7లో

ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథములకెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

# జనని సంస్కృతంబు

సంస్కృతం భరత జాతి సంపద. కాకపోతే,భారత జాతీయ భాషగా ప్రకటించండంటూ న్యాయస్థానాల చుట్టూ తిరగాల్సి రావడమే విషాదం.ఈ అంశంపై సుప్రీంకోర్టులో ఓ ప్రజా ప్రయోజనాల వ్యాజ్యందాఖలైంది. దీనిని ఆ మధ్య సుప్రీం కోర్టు కొట్టేసింది. "దీనికి రాజ్యాంగ సవరణ అవసరం. ఇది పాలసీలకు సంబంధించిన విషయం.దీనిని మేం మార్చలేం. దీనిపై చర్చించడానికి సరియైన వేదిక పార్లమెంట్" అని సుప్రీం ధర్మాసనం ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది.హిందీతో పాటు సంస్కృతాన్ని కూడా జాతీయ భాషగా పేర్కొనాలని గుజరాత్ మాజీ అదనపు సెక్రటరీ కె.జి.వంజార పిల్ వేశారు. సంస్కృత ఉచ్చారణలో జీవశక్తి ఉంటుందని,మెదడు చురుక్కుగా పనిచేయడానికి ఉపయోగపడుతుందని, లయబద్ధమైన ఉచ్చారణ వల్ల పిల్లల్లో జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుందన్నది ఆయన వాదన. సంస్కృతాన్ని జాతీయ భాషగా చేయడం వల్ల హిందీ,ఇంగ్లిష్ భాషలకు వచ్చే నష్టం ఏమీ లేదని ఆయన భావం. వంజార ఆలోచనలు,ఆశయం అభినందనీయం. లోక్ సభ చర్చలు, ప్రతి చర్చల్లోని రాజకీయ కోణాలు ఎలా ఉన్నా,మనదైన గొప్ప భాష కలకాలం మన్నడానికి ప్రతి ఒక్కరూ సహకరించడమే సహేతుకం. అవసరార్థం,బతుకు తెరువు కోసం ఇంగ్లిష్ భాష అత్యవసరమైన నేటి కాలంలో,స్థానిక భాషల ప్రస్థానం ప్రశ్నార్థకంగా మారింది. బ్రిటిష్ పాలనలో లార్డ్ మెకాలే రుద్దిన విద్యా విధానం వల్ల మనం చాలా నష్టపోయాం. వాటిల్లో మన భాషలు కూడా ఉన్నాయి.'త్రిభాషా సూత్రం' చాలా కాలం చాలా రాష్ట్రాల్లో బాగానే అమలైంది. తమిళనాడు వంటి కొన్ని చోట్ల హిందీ విషయంలో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. భాషాభిమనం ఆహ్వానించ తగినదే. కానీ, దురాభిమానమే కొంపలు ముంచుతుంది. ఈ తీరు వల్ల ఆ యా రాష్ట్రాల్లో జీవించే అన్యభాషీయులకు పెద్ద అన్యాయం జరుగుతోంది. మాతృభాష /స్థానిక భాష,దేశంలో ఎక్కువమంది మాట్లాడే హిందీ,ప్రపంచభాషగా చెలామణి అవుతున్న ఇంగ్లిష్... ఇలా మూడు భాషలు చదవడం వల్ల ఎంతో ప్రయోజనం ఉందని భాషా శాస్త్రవేత్తలు కూడా అనేకమార్లు చెప్పారు. అందులో నిజముంది.కొన్ని విద్యాలయాలలో ఇంగ్లిష్ తో పాటు కొన్ని విదేశీ భాషలు కూడా అందుబాటులో ఉన్నాయి. బహుభాషలు నేర్చుకోవడం తప్పేమీ కాదు. పైగా ఎన్నో ప్రయోజనాలు కూడా ఉన్నాయి. అదే సమయంలో, మనదైన సర్వ విజ్ఞానమంతా నిక్షిప్తమై ఉన్న సంస్కృతాన్ని కూడా తప్పకుండా చదవాలి.అత్యంత ప్రాచీనమైన మన భాషను కాపాడుకోవడంతో పాటు మన ప్రాచీన జ్ఞాన సంపద మళ్ళీ మనకు దగ్గరవుతుంది. మనదేశంలో సంస్కృతం చదివేవారి సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. మార్కుల స్కోరింగ్ నెపంతో కొందరు విద్యార్థులు మాతృభాషను వీడి సంస్కృతం వైపు మొగ్గు చూపిస్తున్నారు.ఇది కేవలం మార్కుల మీద ప్రేమ తప్ప భాషాభిమానం కాదు. ఈ ఆలోచనా విధానం విద్యా విధానాలలోని లోపాల వల్ల మాత్రమే వచ్చింది. ఇంగ్లిష్ భాషను నేర్చుకోవడం వల్ల ఎన్నో పుస్తకాలు చదవగలుగుతున్నాం, అర్థం చేసుకోగలుగుతున్నాం, పది దేశాలు తిరిగి నెట్టుకు రాగలుగుతున్నాం. అదే స్ఫూర్తి సంస్కృత భాషను అధ్యయనం చేయడంలోనూ చూపిస్తే? గొప్ప జ్ఞానం అబ్బి,జీవశక్తి ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతుందని పెద్దలు చెప్పిన మాటలు సత్యవాక్కులు. దేశంలోని వివిధ విద్యాలయాల లోని కోర్సుల్లో ఉండే సంస్కృతం విషయంలో పరీక్షలు రాసే సమయంలో ఎక్కువ మంది ఎక్కువ శాతం సంస్కృతం కంటే ఇంగ్లిష్ లేదా మాతృభాష /స్థానిక భాషలను ఎంచుకుంటున్నారు. 'దేవనాగరి' లిపిని ఎంచుకుంటేనే సంస్కృత భాషా పరంగా సంపూర్ణమైన న్యాయం జరుగుతుంది,ప్రయోజనం సిద్ధిస్తుందని చెప్పవచ్చు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా ఈ విషయాన్ని పదే పదే గుర్తుచేస్తున్నారు కానీ ఆచరణలో అది జరగడం లేదు.దీనిపై కేంద్రంతో పాటు,రాష్ట్ర ప్రభుత్వాలు కూడా నిబద్ధతతో దృష్టి సారించాలి. మన జ్ఞానమంతా వేదాల్లోనే ఉందని కదా మన పెద్దలు చెప్పారు.మన శాస్త్రాలన్నీ మొన్నటి వరకూ సంస్కృతంలో ఉన్నాయని కదా వారి వాదన.మన దేశాన్ని దురాక్రమించిన అనేక దేశస్తులు మన సంపదతో పాటు మన వేద సర్వస్వాన్ని పట్టుకెళ్ళిపోయి, మనవారితోనే ఆ విశేషాలు తెలుసుకొని వారి భాషల్లోకి అనువదించుకున్నారనే వేదనామయమైన వాదనలు మనకు తరచూ వినపడుతూ ఉంటాయి.మన శాస్త్రాలు చదివి, రహస్యాలు తెలుసుకొని తిరిగి మనకే వాటిని అమ్మే దుస్థితులు వచ్చాయన్నది సంప్రదాయవాదుల వేదన.ఇటువంటి దుస్థితిలోనూ మన దేశంలో ఇప్పటికీ సంస్కృతం మాట్లాడేవారు ఉండి ఉండడం మన అదృష్టం.కర్ణాటకలోని మత్తూరు అనే గ్రామంలో అందరూ పూర్తిగా సంస్కృతంలోనే మాట్లాడుతారు. అది వారికి వాడుక భాష, వ్యావహారిక భాషగా ఉండడం గొప్ప విశేషం.ఈ ఊరును ఆదర్శంగా తీసుకొనే ప్రయత్నంలో కొందరు ఇప్పుడిప్పుడే ముందుకు వస్తున్నారు.మన దేశ నాగరికత విలసిల్లిన గత చారిత్రక వైభవంలో సంస్కృతం స్థానం శిఖరాయమానం. గ్రీకు, ల్యాటిన్, జర్మన్, ఫ్రెంచ్ మొదలైన భాషలు ఇంకా విలసిల్లుతున్నాయి. వాటిల్లోని అనేక పదాలకు -సంస్కృత పదాలకు ఎంతో పోలిక ఉందని గమనించవచ్చు. భారతీయ భాషలతో పాటు అనేక ప్రపంచ భాషలకు కూడా సంస్కృతమే మూలమనే వాదన కూడా ఉంది. ఈ అంశంపై ఇంకా విస్తృతంగా అధ్యయనం జరగాల్సి వుంది. శబ్దశక్తి అపారంగా కలిగి,శ్రావ్యతలో తలమానికంగా నిలిచి, గొప్ప చారిత్రక నేపథ్యం కలిగి వున్న సంస్కృతం ఇంకా ఎన్నో రెట్లు ప్రచారంలోకి రావాలి. వాడుక పెరగాలి.మన వికాసానికి దోహదకారిగా నిలుపుకోవాలి. అమరభాషను మరవకుండా అధ్యయనం పెంచుకుంటూ ముందుకు సాగడం వివేక శోభితం, విజ్ఞాన భరితం.ప్రభుత్వాలు,ప్రజలు కలిసి సాగితేనే సర్వ సంకల్పాలు నెరవేరుతాయి.సంస్కృత భాషా వ్యాప్తి పెరగాలి. సంస్కృత భాషను కాపాడుకోవాలి, రేపటి తరాలకు కానుకగా అందించాలి. ఇది మనందరి బాధ్యత.

# దర్శక శిఖరం... దాసరి నారాయణ రావు



***తెలుగు చిత్రసీమకు ఆయనో పెద్ద దిక్కు... చిన్న సినిమాలకు ఆయనో చిరునామా... దర్శకులకే బ్రాండ్ ఇమేజ్ తెచ్చిన గొప్ప దర్శకుడాయన... అనేకమందికి నటీనటులుగా జీవం పోసిన గురుపుంగవుడాయన... ఆయనే... దర్శకరత్న దాసరి నారాయణ రావు...*** తన పిలుపులోనే రత్నాన్ని చేర్చుకోవడమే కాదు నిజంగా దర్శకులలో రత్నంగా ఎదిగిన ప్రతిభ గల దర్శకుడాయన...అంతకు మించి ఎందరో కళాకారులు, టెక్నీషియన్లతో గురువుగా పిలిపించుకునే దాసరి నారాయణ రావు ఎందరికో సినిమా జీవితాన్ని ప్రసాదించిన మరపురాని దర్శకుడు.. దర్శకరత్న దాసరి నారాయణ రావు పేరు వినగానే చిన్నసినిమా గుర్తుకొస్తుంది. సినిమాను తక్కువ ఖర్చుతో జనరంజకంగా తీయవచ్చని నమ్ముతూ, తాను నమ్మిన సిద్ధాంతానికనుగుణంగా అనేక సినిమాలు నిర్మించి విజయ ఢంకా మ్రోగించిన ప్రతిభ గల దర్శకుడాయన. తెలుగు చిత్ర సీమకు తలలో నాలుకగా.. చిన్న సినిమాలకు పెద్ద దిక్కుగా, దర్శకులకు బాసటగా.. నటీనటులకు నారాయణ మంత్రంగా నిలిచిన మహోన్నత వ్యక్తి. దాసరి అనే ఇంటి పేరును ఒక బ్రాండ్ గా చేసుకుని తెలుగు సినీ చరిత్రలో తనకంటూ ప్రత్యేక అధ్యాయాలు లిఖించుకున్న అతికొద్ది మంది దర్శకుల్లో దాసరి నారాయణ రావు ఒకరు. అత్యధిక చిత్రాలకు దర్శకత్వం వహించిన దర్శకునిగా గిన్నీస్ బుక్‌లో స్థానం సంపాదించి, సినిమాకు కెప్టెన్ దర్శకుడే అని దర్శకునికి ఓ స్పెషల్ ఇమేజ్ తీసుకొచ్చిన టాలెంటెడ్ దర్శకుడాయన. తెలుగు ఇండస్ట్రీలో వందల మంది చేత గురువు అని పిలిపించుకున్న లెజెండ్ దాసరి నారాయణరావును, ఆధునిక తెలుగు సినిమాను వేరు చేసి చూసే సాహసం ఎవ్వరూ చేయలేరు. వందలకొద్దీ అద్భుతమైన పాత్రలు, బాక్సాఫీసు హిట్టులు, కలెక్షన్లు, సొంతం చేసుకున్న దాసరి నారాయణరావు దర్శకునిగా తన సినీ ప్రస్థానాన్ని తాతామనువడుతో ప్రారంభించి ఎర్రబస్సుతో ముగించారు. తెలుగు చిత్రసీమకు మరపురాని చిత్రాలెన్నింటినో అందించిన దాసరి నారాయణ రావు. 1942 సంవత్సరం మే 4వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో జన్మించారు. చిన్నప్పటి నుంచి నాటకాల మీద, రచన మీద ఆసక్తి ఉన్న ఆయన కళాశాల నుంచే నాటకాలు వేయడమే కాకుండా కొన్ని నాటకాలకు దర్శకత్వం వహించారు. ఇలా ఉండగా, 1966లో దాసరి వేసిన నాటకాన్ని చూసిన ప్రముఖ నిర్మాత వై.వి.కృష్ణయ్య ఆయనకు మొదటి సారిగా నటుడిగా అవకాశం ఇచ్చారు.ఆ తర్వాత కె.రాఘవ నిర్మించిన 'తాతా మనవడు'తో డైరెక్టర్‌గా మారిన దాసరి, ఆ చిత్రం ఘన విజయం సాధించడంతో ఇక వెనుతిరిగి చూసుకోలేదు. అప్పటి వరకు హాస్య నటుడిగా ఉన్న రాజబాబుకు స్టార్ ఇమేజ్ ను తీసుకొచ్చిన దర్శకుడాయన. ఆయన తన తాతామనువడు చిత్రం ద్వారా రాజబాబును సోలో హీరోగా పరిచయం చేసి విజయం సాధించారు. ఆ చిత్ర విజయంతో కథానాయకుడి పాత్రలు ఎవరితోనైనా చేయించి విజయం సాధించవచ్చన్న కొత్త ఇమేజ్ కు ఆయన శ్రీకారం చుట్టారు. ఆనాటి నుంచి ఎందరో కొత్త నటీనటులను పరిచయం చేస్తూ, ఆయా చిత్రాల ద్వారా వారికి సినిమా భవిష్యత్ ను ప్రసాదించిన మేటి దర్శకుడాయన. దాసరి నారాయణ రావు చేసిన ఒక్కొక్క సినిమా ఒక్కొక్క ఆణిముత్యం. నూతన నటీనటులతో, స్టార్ ఇమేజ్ లేని నటులతో తీసిన చిత్రం స్వర్గం నరకం. ఆ చిత్రం ద్వారా తననో నటుడిగా కూడా ప్రూవ్ చేసుకున్న దాసరి, ఆ చిత్ర విజయంతో మొత్తం తెలుగు చిత్రాల ఒరవడినే పూర్తిగా మార్చి వేశారు. ఇదే పంథాలో ఆయన చేసిన మరో అపురూప చిత్రం నీడ. ఆ చిత్రంలో హీరో కృష్ణ కుమారుడు రమేష్ ను పరిచయం చేసి సినిమా ప్రేక్షకులను ఆ చిత్రం ద్వారా ఆలోచింప చేశారు. ఆ తరువాత ఆయన నిర్మించిన తూర్పు పడమర, శివరంజని లాంటి చిత్రాలు ఆయనకు మంచి పేరును తీసుకొచ్చాయి. దాసరి నారాయణరావు ఏ చిత్రం చేసినా అది నిజ జీవితానికి దగ్గరగా ఉంటుంది. అసలు ఒక కథను సినిమాగా తీయడంలో.. ఆ కథనాన్ని రక్తి కట్టించడంలో.. డైలాగులు పండించడంలో ఆయనకు ఆయనే సాటిగా పేరు సంపాదించారు. ఆయన ఎవ్వరితో సినిమా చేసినప్పటికీ, ఆ సినిమా ద్వారా తనకే కాకుండా ఆయా సినిమాల్లో నటించిన వారందరికీ ఓ స్పెషల్ ఇమేజ్‌ను తీసుకొచ్చారు. ఎన్టీఆర్‌తో బొబ్బిలిపులి, సర్దార్ పాపారాయుడు, విశ్వరూపం వంటి బాక్సాఫీసు హిట్లిచ్చిన ఆయనే ఏఎన్ఆర్‌తో ప్రేమాభిషేకం, మేఘసందేశం, బహుదూరపు బాటసారి లాంటి బ్లాక్ బస్టర్ సినిమాలిచ్చారు. ముఖ్యంగా ప్రేమాభిషేకం తెలుగు చిత్ర సీమలో ఓ ప్రభంజనం సృష్టించింది. హీరోగా పనైపోయిందను కున్న ఏఎన్ఆర్ ఇమేజ్ ను 'ప్రేమాభిషేకం' సినిమాతో నిలబెట్టి న ఘనత దాసరిది. అలాగే, ప్రేమాభిషేకం, సర్దార్ పాపారాయుడు, తాండ్రపాపారాయుడు వంటి చిత్రాల్లో అద్భుతమైన పాత్రలి చ్చి మోహన్ బాబును ఎక్కడికో తీసుకెళ్లిన ఘనత దాసరిది. అటు మోహన్ బాబునే కాదు... మురళీ మోహన్, పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణ మూర్తి నుంచి మొదలు పెడితే నర్సింహారాజు హరి ప్రసాద్, శ్రీహరి, రమేష్ బాబు, మహేశ్ బాబు సహా ఎంతో మంది హీరోలను వెండితెరకు పరిచయం చేసిన ఘనత దాసరిది. అలాగే, జయసుధ, జయప్రద, మాధవి, శ్రీదేవి, సుజాత, సిల్క్ స్మిత, రజినీ, అన్నపూర్ణ, ఫటాఫట్ జయలక్ష్మీ సహా ఎంతో నటీమణులకు స్టార్ డమ్ తీసుకొచ్చిన ఘనత కూడా ఆయనదే. దీనితో పాటు కటకటాల రుద్రయ్య, తాండ్రపాపారాయుడు, రంగూన్ రౌడీ, సీతారాములు వంటి చిత్రాలతో కృష్ణంరాజును మాములు స్టార్ నుంచి రెబల్ స్టార్‌గా తీర్చిదిద్దిన ఘనత కూడా దాసరికే దక్కుతుంది. అలాగే, కృష్ణతో యుద్ధం, ఊరంతా సంక్రాంతి, విశ్వనాథ నాయకుడు వంటి ఎన్నో హిట్ సినిమాలను చేసి విజయ దుంధుభి మ్రోగించారు. ఇక వెంకటేష్‌కు బ్రహ్మపుత్రుడు, నాగార్జునకు మజ్నూ లాంటి హిట్ చిత్రాలిచ్చి, వారి సినీకెరీర్‌కు పునాది వేసిన ఘనత కూడా ఆయనదే. అలాగే, అప్పటి వరకు సినిమా పరిశ్రమ అంటే గ్లామరే కాదని, కష్టాలు, కన్నీళ్ళు, కలతలు ఉంటాయని చెప్పడానికి శివరంజని, అద్దాలమేడలాంటి చిత్రాలు తీసిన సాహసి దాసరినారాయణరావు. ఆయా చిత్రాల ద్వారా మూవీ ఇండస్ట్రీలో ఉండే లోటుపాట్లను చీకటి కోణాలను నటీనటులు పడే సంఘర్షణను అద్భుతంగా తెరకెక్కించారు. అంతేకాదు సినీ నటీనటుల జీవితాలు వడ్డించిన విస్తరి కాదని ఆయా సినిమాల ద్వారా చూపించారు. దర్శకుడిగానే కాదు నటుడిగా కూడా దాసరి మెరిశారు. స్వర్గం నరకం చిత్రంతో మళ్లీ ముఖానికి రంగేసుకున్న ఆయన అనేక చిత్రాలలో మంచిమంచి పాత్రెలన్నో చేశారు. వీటిలో మామగారు, మేస్త్రీ వంటి చిత్రాలు ఆయనకు మంచి పేరు తీసుకురావడమే కాకుండా పురస్కారాలను కూడా సాధించిపెట్టాయి. ఒకవైపు మాటల రచయితగా, దర్శకుడిగా బిజీగా ఉన్న దర్శకరత్న పాటల రచయితగా కూడా రాణించారు. పాటల రచనతో తన కలానికి రెండు వైపులా పదును ఉందని నిరూపించుకున్నారు. అలాగే అనేక మంది యువకులను ప్రతిభావంతులైన దర్శకులుగా తీర్చిదిద్దిన ఘనత కూడా దాసరిదే...కోడిరామకృష్ణ, రవిరాజ పినిశెట్టి, రేలంగి నరసింహారావు, కె.మురళీమోహన్ రావు, సురేష్ కృష్ణ, కే.యస్.రవికుమార్ టాంటి సుప్రసిద్ధ దర్శకులు దాసరి శిష్యరికంలోనే పెద్ద దర్శకులయ్యారు. మొత్తం మీద తన 40ఏళ్లకు పైగా సినీ ప్రస్థానంలో 151 చిత్రాలకు దర్శకత్వం వహించారు. 54 సినిమాలను నిర్మించారు. 250 చిత్రాలకు సంభాషణలు అందించారు. అంతే కాదు జర్నలిస్టుగా... పబ్లిషర్‌గా...మ్యాగజైన్ ఎడిటర్‌గా...డిస్ట్రిబ్యూటర్‌గా... రాజకీయవేత్తగా, కేంద్ర మంత్రిగా ఇలా అనేక రంగాల్లో రాణించి, బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరు గడించారు. అలాగే, తెలుగుతో పాటు తమిళ, కన్నడ, హిందీ చిత్రాలకూ దర్శకత్వం వహించి, తెలుగు చిత్ర సీమలో ఏ దర్శకునికి రానంత పేరును, స్టార్ ఇమేజ్ ను సంపాదించుకున్నారు. అనేక అద్భుతమైన చిత్రాలను నిర్మించి, దర్శకత్వం వహించిన దాసరిని అనేక పురస్కారాలు వరించాయి. మేఘసందేశం, కంటే కూతుర్నే కను సినిమాలకు గాను జాతీయ పురస్కారాలు అందుకున్నారు. అటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తమ నటుడిగా రెండు నంది పురస్కారాలు, 1990లో ప్రతిష్టాత్మక రఘుపతి వెంకయ్య పురస్కారం, 2007లో ఎన్టీఆర్ జాతీయ పురస్కారంతో పాటు ఉత్తమ దర్శకుడిగా, మాటల,పాటల రచయితగా అనేక పురస్కారాలు అందుకున్నారు. తన చివరి శ్వాస వరకు చిన్న చిత్రాలు, నిర్మాతలు బతికి బట్ట కట్టాలని కోరుకున్న దాసరి నారాయణరావు తీవ్ర అనారోగ్యంతో 2017 సంవత్సరం మే 30వ తేదీన తిరిగి రాని లోకాలకు వెళ్ళి పోయారు. ఆయన వేసిన బాట, దర్శకుడిగా ఆయన చేసిన ప్రయాణం పలువురికి ఆదర్శం. దాసరి లేని లోటు ఎన్నటికీ తీర్చలేనది. తెలుగు చిత్ర సీమలో పూడ్చలేనిది.

– దాసరి దుర్గా ప్రసాద్

# హిందీ ప్రచారానికి జీవితం అర్పించిన కాజ వెంకటేశ్వరరావు



పుట్టింది, పెరిగింది పల్లెటూరులో. వ్యవసాయమే జీవనాధారం. బాల్యంలోనే తండ్రి మరణించారు. భవిష్యత్తు అగమ్యగో చరమైంది. హిందీ భాష పట్ల మక్కువ పెంచుకున్నారు. మహాత్మాగాంధీ చేతుల మీదుగా రాష్ట్ర భాషా విశారద సర్టిఫికేట్ అందుకున్నారు. హిందీలో బి.ఇ.డి. కోర్సు ఏర్పాటుకు మూలకారకులైనారు. 20 ఏళ్లలో 1200 మంది హిందీ ఉపాధ్యా యులుగా మారటానికి దోహదపడ్డారు. 80 ఏళ్ల వయసులో కూడా హిందీ ప్రచారానికి శ్రమించారు. భారత రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతుల మీదుగా దేశంలో అత్యంత ప్రతిష్టాక రమైన "గంగా చరణ్ సింహ" పురస్కారం అందుకున్నారు కాజ వెంకటేశ్వరరావు. కాజ వెంకటేశ్వరరావు 1923 మే 30న జన్మించారు. కృష్ణాజిల్లా, గుడివాడకు సమీపంలోని వానపాముల వీరి జన్మస్థలం. తల్లి రత్తమ్మ, తండ్రి కృష్ణయ్య. వెంకటేశ్వరరావు విద్యాభ్యాసం వానపాములలోనే మొదలైంది. ప్రాథమిక విద్య పూర్తి కాక ముందే తండ్రి మరణించారు. అన్న రంగదాసు వద్ద పెరుగుతూ వారికి వ్యవసాయ పనుల్లో తోడుగా ఉండేవాడు. ఆ సమయంలో సూరపనేని సీతారామయ్య హిందీ భాష ప్రచార నిమిత్తం వానపాముల గ్రామం విచ్చేశారు. వారి మాటలు విన్న వెంకటేశ్వరరావు హిందీ పట్ల ఆపేక్ష పెంచుకు న్నారు. హిందీ నేర్చుకోవాలనే ఆశతో వారి వెంట వెళ్ళారు. ఆ కాలంలో హిందీ ప్రచార సభ అధ్యక్షులుగా మోటూరి హను మంతరావు కొనసాగుతున్నారు.హిందీ పట్ల వెంకటేశ్వ రరావుకున్న మక్కువ, శ్రద్ధాసక్తులు ఆయన్ని ఆశ్చర్యపరచాయి. హిందీ భాష ఔన్నత్యాన్ని వివరిస్తూ ఆ భాష నేర్చుకోవటానికి అవసరమైన సూచనలు కూడా ఇచ్చారు. ఆ తర్వాత కొత్తపల్లి వెంకట కృష్ణయ్య వర్మ, యలమంచిలి వెంకటేశ్వరరావుల వద్ద హిందీ భాషలోని కీలక అంశాలను నేర్చుకున్నారు. పామర్రుకు దగ్గరలోని కొమరవోలు గాంధీ ఆశ్రమంలో కొంతకాలం ఉండి హిందీ భాషలోని మెళకువలు నేర్చుకున్నారు. వెంకటేశ్వరరావు బాల్యమంతా హిందీ భాష నేర్చుకొవటానికే వెచ్చించారు. 1946 నాటికి విశారద పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. అదే సమయంలో మద్రాసు హిందీ ప్రచార సభ, మహాసభలు జరిగాయి. ఆ సభల్లో వెంకటేశ్వరరావు వారం రోజుల పాటు వాలంటీరుగా పని చేసి హిందీ భాషాభిమానుల ఆశీస్సులు అందుకున్నారు. ఆ కార్యక్రమం ముగింపుకు మహాత్మాగాంధీ ముఖ్య అతిథిగా విచ్చేశారు. వారి చేతుల మీదుగా "రాష్ట్ర భాషా విశారద" సర్టిఫికేట్ అందుకున్నారు హిందీ భాషంటే తెలియని పల్లెటూరులో పుట్టి పెరిగిన వెంకటేశ్వరరావు. 1923లో జన్మించిన వెంకటేశ్వర రావు 1943 నాటికి హిందీ నేర్పటం ప్రారంభించి హిందీ పంతులుగా గుర్తింపు పొందారు. ఆ తర్వాత మూడేళ్ళకు హిందీ విశారద సర్టిఫికేట్ అందుకున్నారు. హిందీ పాఠాలు చెప్పటం ముదునూరుకే పరిమితం చేయకుండా బుద్ధవరం, వేలేరు, నెప్పల్లి, కుందేరు గ్రామాల్లోని పెద్దవారికి కూడా హిందీ నేర్పి వయసులో తన కన్నా పెద్దవారైన చాలామందిని తన శిష్యులుగా మలుచుకున్నారు. 1952లో జిల్లా బోర్డు ఏర్పడింది. జిల్లా బోర్డు తరఫున హిందీ ఉపాధ్యాయునిగా అవకాశం వచ్చిం ది. గొల్లపల్లి, తేలప్రోలు, గన్నవరం, చిన గొల్లపాలెం వంటి చోట్ల జిల్లా బోర్డు తరపున హిందీ నేర్పి, హిందీ భాషాభివృద్ధికి అహర్నిశలూ శ్రమించారు. 1979లో హిందీ ఉపాధ్యాయునిగా పదవీవిరమణ చేశారు. ఉద్యోగ విరమణ చేసినా హిందీ ఉద్యమం మాత్రం ఆపలేదు. అప్పటికే విజయవాడలో దక్షిణ భారత హిందీ ప్రచార సభ కార్యాలయం ఏర్పాటయింది. హిందీ పట్ల వెంకటే శ్వరరావుకున్న ఆపేక్ష ఆ వైపుకు నడిపింది. హిందీ ప్రచార సభ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, భాషాభివృద్ధికి అపార సేవలు అందించారు. హిందీ నేర్చుకున్న చాలామంది నిరుద్యో గులుగా ఉండి పోవటం గమనించారు. హిందీలో బి.ఇ.డి. కోర్సు కూడా ఉండాలని అభిప్రాయపడి, 1987లో హిందీ బి.ఇ.డి. కోర్సు ప్రారంభించటానికి అహర్నిశలూ శ్రమించారు. ఆ తర్వాత అది బి.ఇ.డి. కళాశాలగా రూపుదాల్చటానికి శ్రమిం చారు. ఏడాదికి 60 మంది చొప్పున హిందీ బి.ఇ.డి.లు చేసి 20 ఏళ్లలో 1200 మంది హిందీ బి.ఇ.డి.లు తయారై జీవితం లో స్థిరపడటానికి అవకాశం సుగమం చేశారు. విజయవాడ హిందీ బి.ఇ.డి. కళాశాల కన్వీనరుగా హిందీ మహా విశ్వవి ద్యాలయం అధ్యక్షులుగా పని చేసి వాటి అభివృద్ధికి అపార కృషి చేశారు. దక్షిణ భారత హిందీ ప్రచార సభ, మద్రాసు ప్రాంత కన్వీనరుగా, కార్యనిర్వాహక సభ్యులుగా, ప్రకాశన సమితి సభ్యులుగా, పరీక్షా సమితి ఉపాధ్యక్షులుగ, ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచారక్ మండలి అధ్యక్షులుగా పని చేసి హిందీ భాషాభివృద్ధికి కృషి చేశారు. 80 ఏళ్ల వయసులో కూడా గన్నవరం నుంచి విజ యవాడకు ప్రయాణిస్తూ, హిందీ భాషాభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలు నిర్వహిస్తుండేవారు. వీరి కృషిని గుర్తించిన మద్రా సు హిందీ ప్రచార సభ విశిష్ఠ పురస్కారం అందించింది. హిందీ ప్రచారానికి లభించే జాతీయ స్థాయి అత్యున్నత పురస్కారం "గంగా చరణ్ సింహ" 2005లో భారత రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఆజాద్ చేతుల మీదుగా అందుకున్న కాజ వెంకటే శ్వరరావు 2011 ఏప్రిల్ 4న స్వర్గస్తులయ్యారు.

-దాసరి ఆళ్వారస్వామి

# దైవ సమానులుగా గుడిలో నిత్య పూజలు అందుకుంటున్న గుండి రాజర్షి"




ఆయన కర్మయోగి. అష్టాదశ పురాణాలను ఔపోసన పట్టి, వేద వేదాంగ సకల శాస్త్రాలపై సాధికారికత కలిగి ఎలాంటి పౌరాణిక సందేహాన్ని అయినా నివృత్తి చేయగలిగిన అపర వేదవ్యాసుడు ఆయన. నిరంతర తపోనిష్టతో, నిత్య భాగవత పారాయణము మందే మునిగి తేలి, సిద్ధిపొందిన తాపసి ఆయన. దివంగత ప్రధాని పి.వి. నరసింహా రావు మొదలు గాగల అగ్ర నేతలు, కవిసామ్రాట్ విశ్వనాథ లాంటి సాంప్రదాయ కవులు, ప్రాచ్య పాశ్చాత్య విద్యావేత్తలు ఎందరి చేతనో పలుమార్లు దర్శింప బడి మహామహులచే పూజింప బడిన పరమ భాగవతోత్తముడు ఆయన. ఆయనే గుండి రాజర్షిగా పేరెన్నిక గన్న గుండి రాజన్న శాస్త్రి. ధర్మపురి క్షేత్ర గోదావరి తీరాన గుడి నిర్మించబడి, విగ్రహ ప్రతిష్ఠ జరిగి, నిత్య పూజలు అందుకుంటున్న దైవ సమానులు గుండి రాజర్షి. భారతీయ ప్రాచీన ఆర్ష విద్యలకు నెలవై, హైందవ సనాతన సాంప్రదాయాలకు పట్టు కొమ్మయై, వేద సంస్కృతి సభ్యతలకు ఆలవాలమై, వరదాయినిగా, భక్తి ముక్తి ప్రదాయినిగా తెలుగునేలపై వాసికెక్కిన, గోదావరి తీరస్త పవిత్ర తీర్థ రాజం ధర్మపురి క్షేత్ర కీర్తి ప్రతిష్టలను, దశదిశలా వ్యాపింప జేశారు, అపర వేదవ్యాసులుగా కీర్తించబడే గుండి రాజర్షి... వ్యాస, వాల్మీక, కాళిదాస, కాణాద, పైల, జైమిని, పరాశర ఆపస్తంభ అది మునులు ఋషులు, యోగులు, కర్మిష్టులు, పరివ్రాజకుల, ఆధ్యాత్మికుల వార సత్వాన్ని కొనసాగిస్తూ, దేవతా పూజలతో, ఆధ్యాత్మిక ఆది భౌతిక కార్యక్రమాలను, అక్షయ నిధులైన పురాణ ప్రవచనాలను, క్షేత్ర రాజం పరిరక్షిస్తూనే ఉంది. ఆ సంప్రదాయ ఆచరణ క్రమంలో "అపర వేదవ్యాసులు"గా పేరెన్నికగన్న రాజన్న శాస్త్రి తన స్వగృహంలో ప్రవచనాలను నిర్వహించగా, దివంగత భారత ప్రధాని పీవీ నరసింహారావు, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి, ఆచార్య దివాకర్ల వెంకటావధాని, తెన్నేటి విశ్వనాథం, విశ్వనాథ సత్యనారాయణ లాంటి మహామహులు ఎందరో, ప్రత్యేకించి ఈ క్షేత్రానికి వచ్చి, రాజన్న శాస్త్రి, భాగవత ప్రవచనాలను విని, ఆధ్యాత్మిక లోకాలలో విహరించి, ఆయనకు ప్రణమిల్లిన సంఘటనలు, క్షేత్ర వాసులకు చర్విత చర్వణలే. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణచే "మ్రోయు తుమ్మెద" లో వర్ణించ బడినట్లుగా, గుండి రాజన్న శాస్త్రి అష్టాదశ పురాణాలను, నిరంతరం అధ్యయనం చేస్తుండగా పాశ్చాత్య పండితులెందరో, పౌరాణిక సందేహ నివృత్తికై శాస్త్రి వద్దకు వెళ్లిన సంఘటనలు, క్షేత్ర వాసులకు నిత్య జ్ఞాపకాలే. సాక్షాత్తు "వేదవ్యాస అవతారం"గా భావించబడే రాజన్న శాస్త్రి విగ్రహ ప్రతిష్ట చేసి, ఆలయం నిర్మించి, నిత్య పూజలు జరపడం విశేషం. ధర్మపురి క్షేత్రంలో గుండి లక్ష్మీ నరసింహ ఘనాపాఠి లక్ష్మీ నరసమ్మ దంపతులకు 1893 డిసెంబర్ 9న జన్మించిన శాస్త్రి, గుండి పాపయ్య కుటుంబానికి దత్తపుత్రులైనారు. బాల్యం నుండే ప్రహ్లాదాదుల వలె పరమాత్మ చింతనాపరులై, దివ్య ప్రబంధాదుల గానం చేస్తూ, ప్రాథమిక విద్య ఉర్దూ భాషలో జరిగినా, అష్ట వర్షములకే ఉపనయన సంస్కారులై, గాయత్రీ మంత్రోపాసకులై, వేదాధ్యయనాలు తండ్రి వద్ద చేసి, లీలావతి గణిత సాధన, మంథని చెందిన గట్టు కృష్ణశాస్త్రి వద్ద అమర భాష శాస్త్రాలను నేర్చుకున్నారు. అనంతరం వేద వేదాంగ, శాస్త్ర ఆగమ, ప్రస్థాన త్రయ, సాయణ భాష్య, శాంతి పాఠాలను రామాయణ, భారత, భాగవతాది పురాణాలు, ప్రధానంగా భాగవత బ్రహ్మసూత్రాలను కంఠోపాఠంగా చెప్పగలిగిన, అసాధారణ ధారణ శక్తి సంపన్నులైనారు. స్థానిక లక్ష్మీనరసింహ ఆలయంలో, కొంతకాలం నిరంతర భాగవత సప్తాహ యజ్ఞాలను నిర్వహించారు. ఉష: కాల మందే లేచి, నిత్య గోదావరి స్నానం, సంధ్యావందనం, ధ్యాన, ధారణ, పూజ, ఉపాసన, పారాయణ ఆది సత్కార్యాచరణలు నిత్య కృత్యాలుగా కలిగి ఉండేవారు. సమకాలీన సలక్షణ వేద ఘనాపాటిల సన్నిధిలో, వేదార్థ, ఉపనిషత్, భాష్య ప్రవచనం గావించేవారు. భక్త బృందం సమేతంగా, రాత్రి సత్సంగ, భక్తి మయ జాగంౕణలు, సంగీత సభలు, సాహితీ గోష్టులు, భజనలతో గడిపే వారు. ప్రధానంగా ధర్మపురి దేవస్థానంలో, వైకుంఠ ఏకాదశి, నరసింహ నవరాత్రులు, శివరాత్రులు, ఉగాది, ఆదిగా పర్వదిన వేడుకలను ప్రారంభించి ఆచరింప చేశారు. పిత్రార్జితములను, దానధర్మాలకు సన్మానాలకు ధారపోసి, దాన గుణం సంపన్నులైనారు. బాలబాలికలచే, సంస్కృతం మాట్లాడింప చేస్తూ బాలురను శృతి, స్మృతి, పురాణ, కావ్య భక్తిరస ప్రధాన శ్లోకాలు, పద్యాలను కంఠస్తం చేయించేవారు. 1966 విజయదశమి నాడు క్షేత్ర రామలింగేశ్వరాలయంలో, సంస్కృతాంధ్ర డిగ్రీ ప్రాచ్య కళాశాల ప్రారంభించి, ప్రాణ ప్రతిష్ట గావించారు. నాటికీ, నేటికీ ఈ కళాశాల వేలాది మంది భాషా పండితుల తయారీ కేంద్రంగా భాసిల్లుతుండడానికి కారణ భూతు లైనారు . దేశ విదేశీయులు, శాస్త్రి దర్శనం చేసుకొని, పలు సందేహాలు నివృత్తి చేసుకునేవారు. శ్రీ శ్రీ శ్రీ శృంగేరి, కంచి కామకోటి, పుష్పగిరి, హంపి, పీఠాధిపతులు, శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ పెద్ద జీయర్ స్వామి, తదితర జగద్గురు వులు క్షేత్రానికి విచ్చేసిన అన్ని సందర్భాలలోనూ, వారి సన్నిధిన అష్టాదశ పురాణ సందర్భాలను ప్రవచించి, వారిచే సన్మానితులు అయినారు. పి.వి. నరసింహా రావు, బూర్గుల రామకృష్ణారావు, మర్రి చెన్నారెడ్డి, దామోదరం సంజీవయ్య తెన్నేటి విశ్వనాథం, విశ్వనాథ సత్యనారాయణ, దివాకర్ల వెంకటావధాని, బిరుదు రామరాజు, మార్కండేయ శాస్త్రి, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, మల్లాది చంద్రశేఖర శాస్త్రి తదితరులు, పలుమార్లు రాజర్షి వద్దకు ఏతెంచి పునీతులమైనా మని భావించి, అపర వేదవ్యాసులుగా కీర్తించిన సందర్భాలు అనేకానేకాలు. 84 సంవత్సరాలు జీవించి, ధర్మపురి వాసులను సన్మార్గమున నడిపి, 1975 మే 30న జీవన్ముక్తులై శివైక్యం పొందారు. శాస్త్రి మనమడు గుండి విష్ణు ప్రసాద్ చొరవతో, ఆయన సతీమణి ప్రొఫెసర్ వారిజా రాణి సంపాదకత్వంలో, లబ్ద ప్రతిష్టులైన వారి ప్రత్యేక వ్యాసాలతో అపూర్వ, అపురూప, అమూల్య పుస్తకం అచ్చు వేసి, రాజర్షి గురించి పలు అంశాలు పొందు పరచ గలిగారు. "భగవత్ సాన్నిహిత్య సాధనకు సాధువులే కానక్కరలేదని, కౌటింబిక జీవన విధానంలోనూ, భగవానుని భక్తితో కొలిస్తే, ముక్తి లభించగలదని", కొత్త సంప్రదాయానికి పురుడు పోసి, నిత్య నిరంతర పురాణ ప్రవచనాలు నిత్యానందంగా భావించి, సిద్ధి పొందిన తాపసి రాజరుషికి గోదావరి తీరాన, రామమందిర సమీపాన, స్థిర విగ్రహ ప్రతిష్ట గావించి, గుడి కట్టి నిత్య పూజలు నిర్వహించడం, ధర్మపురి వాసులు చేసుకున్న పురాకృత సుకృతం. – రామ కిష్టయ్య సంగనభట్ల

# అనధికార హోర్డింగ్‌లను తీసేయండి



**విజయవాడ,మే 29, (ఆంధ్రపత్రిక):** ఏజెన్సీకి ఇచ్చిన గడువు పూర్తయితే, స్ట్రక్చరల్ స్టెబిలిటీ లేని హోర్డింగ్‌లను తీసేయండినగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం నాడు ప్రధాన కార్యాలయంలో గల నూతన భవనంలో ఉన్న మీటింగ్ హాల్ నందు టౌన్ ప్లానింగ్ సిబ్బంది మరియు ప్లానింగ్ సెక్రటరీస్ తోసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ గత సమావేశంలో ప్లానింగ్ సెక్రటరీ లకి ఆదేశాల మేరకు 224 ఖాళీ హోర్డింగ్ ఫ్రేమ్లను తీసేసారని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ప్లానింగ్ సెక్రటరీలకు అనధికార హోర్డింగ్లను తీసేయాలని, స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికెట్ కోసం నోటీస్ ఇచ్చి, పది రోజుల గడువు అయిపోయిన, ఇంకా స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికెట్ లేని ఏజెన్సీ హోల్డింగ్లను తీసేయాలని బిల్డింగ్ ఆఫీసర్లకు, సెక్రటరీలకు ఆదేశాలు ఇచ్చారు.ఈ సమావేశంలో చీఫ్ సిటీ ప్లానర్ జీవీ జీఎస్ వి ప్రసాద్, డిప్యూటీ సిటీ ప్లానర్ జూబిన్ చీరన్ రాయ్, బి వో లు, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు

### కామేష్ కుటుంబ సభ్యులను పరమర్శించిన

## కొలుసు

**నూజివీడుమే 29 (ఆంధ్రపత్రిక) :** నూజివీడు జనసేన పార్టీ ముఖ్య నాయకులు ముత్యాల కామేష్ నాయనమ్మ ముత్యాల పద్మావతి ఇటీవల అనగా 23 వ తేదీ నాడు స్వర్గస్తులు అవ్వటం జరిగింది. వారి కుటుంబ సభ్యులు తెలుగుదేశం నాయకులు, మాజీ మంత్రివర్యు లు, ఎమ్మెల్యే, నూజివీడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కొలుసు పార్థ సారధి, ముత్యాల కామేష్ కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది.వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, జనసేన పార్టీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

## అజ్మీర్ దర్గాలో సీఎం జగన్ విజయం కోసం వైసీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ ప్రత్యేక ప్రార్థనలు



**విజయవాడ పశ్చిమ,మే 29, (ఆంధ్రపత్రిక):** కులం మతం తేడా లేకుండా ప్రతి ఒక్కరు ప్రార్థించే హజ్రత్ ఖాజా గరీబ్ నవాజ్ అజ్మీర్ షరీఫ్ దర్గాలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా అఖండ మెజారిటీతో గెలవాలని,25 పార్లమెంట్ స్థానాలు గెలవాలని,విజయవాడ పశ్చిమ నియోజకవర్గం లో ఆసిఫ్ గెలవాలని ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ ఆసిఫ్ కుమారుడు షేక్ జావిద్, అల్లుడు అఫ్సర్, జిలాని, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి షేక్ హసేన్ బాషా(భాషి), నరేంద్ర సింగ్ పాల్గొన్నారు.

### అనారోగ్యంతో బాధపడుతున్న దైవ సేవకులను పరామర్శించిన

## కోడూరు మండల దేవుని సేవకులు



**కోడూరు మే 29 (ఆంధ్రపత్రిక) :** కృష్ణాజిల్లా కోడూరు మండలం వి కొత్తపాలెంలో సేవ చేయుచున్న దైవజనులు సిహెచ్ సంసోను బాబు గత కొన్ని దినాలు క్రితం సడన్గా హార్ట్ స్ట్రోక్ రావటంతో విజయవాడ హాస్పటల్లో స్టంట్ వేయించుకుని తిరిగి తన సొంత గృహానికి వచ్చారన్న సంగతి తెలుసుకొని కోడూరు మండలంలో సేవ చేయుచున్న దైవదాసులు పాస్టర్ ఆర్ లాభాను పాస్టర్ కే ప్రసాద్ పాస్టర్ టీ స్టీవెన్ బాబు వారిని పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని దేవుని ప్రార్థించడం జరిగినదితదుపరి ఇటీవల కోడూరు మండలం హరిపురంలో సేవ చేస్తున్న దేవుని సేవకులు పాస్టర్ క్రీస్తు దాసు యాక్సిడెంట్ అవడం తో హాస్పిటల్లో ఉండి తిరిగి సొంత గృహానికి చేరుకున్నారని తెలుసుకొని వారి దగ్గరకు వెళ్లి పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి వారు కూడా త్వరగా కోలుకోవాలని వారి కొరకు ప్రార్థన చేయడం జరిగినది

### నూజివీడు పాలిటెక్నిక్

## ఉద్యోగ సాధకుల రోజు

**నూజివీడు మే 29: (ఆంధ్రపత్రిక):** నూజివీడు మండలం వెంకటాద్రిపురం గ్రామంలో గల నూజివీడు పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ సాధకుల రోజు(జాబ్ ఎచివర్స్ డే) నిర్వహించారు. దీనిలో భాగంగా వివిధ కంపెనీలో ఎంపికైన సివిల్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ మరియు మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులకు ఆఫర్ లెటర్స్ అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వెంకటద్రిపురం పంచాయితీ సెక్రటరీ సి.చంద్రిక ఛైర్మన్ యన్.యన్ రాజేశ్వర రావు, కళాశాల ప్రిన్సిపాల్ వి శ్రీనివాస రాజు , ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్స్ ఆఫీసర్ డి నాగరాజు, విభాగాల అధిపతులు జి నాగరాణి , కె యన్ శ్రావణి, పి ప్రశాంతి, జి సుధాకర్, యస్ ప్రకాశ్ రావు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వి శ్రీనివాస రాజు మాట్లాడుతూ మా కళాశాలలో ఉన్నత విద్యతో పాటు ఉన్నత ఉద్యోగాలు అవకాశాలు పొందే విధంగా బోధనా ఏర్పాటు చేశామని, తద్వారా ప్రతి విద్యార్థి మంచి భవిష్యత్తు ఏర్పాటు చేసుకుంటారని ఆయన తెలిపారు. అలాగే విద్యార్థుల పట్ల ఇంత శ్రద్ధ కనబరిచి వారి భవిష్యత్తు తీర్చి దిద్దుతున్న కళాశాల సిబ్బందిని అభినందించారు. ఇలాంటి మరెన్నో సాంకేతిక కార్యక్రమాలు చేయిస్తూ పాలిటెక్నిక్ విద్యను ముందుకు తీసుకెళ్తున్న సాంకేతిక విద్య మండలి ఛైర్పర్సన్ మరియు కమిషనర్ సి నాగరాణి కిలి మా కళాశాల తరుపున ధన్యవాదాలు.

## సిఆర్వోకు బోర్డు ఏర్పాటు




**శ్రీకాళహస్తి, మే 29 (ఆంధ్రపత్రిక) :** భక్తులకు వసతి గదులు కేటాయించే సిఆర్ఓకు శ్రీకాళహస్తి దేవస్థానం అధికారులు సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. పరిపాలన కార్యాలయ భవనం లోని సిఆర్ఓ ను షాపింగ్ కాంప్లెక్స్ లోకి మార్పు చేశారు. అయితే ఎటువంటి సౌకర్యాలు కల్పించలేదు. అదే కాకుండా భక్తులకు అవసరమైన సమాచారం లేదు. దీనిపై విమర్శలు రావడంతో అధికారులు సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. బోర్డుకు సమీపంలో ప్రైవేటు దుకాణదారులు ఆక్రమణలు చేశారు. దారి కనిపించడం లేదు. అంతేకాకుండా గదులకు సంబంధించిన ఎటువంటి సమాచారం అందుబాటులో లేదు. ధరల సమాచారం కూడా లేదు. ఏదైనా సమస్య ఎదురైతే ఎవరికి ఫిర్యాదు చేయాలనే విషయాలు కూడా భక్తులకు తెలియడం లేదు. వీటిపై కూడా అధికారులు స్పందిస్తే మరింత మంచిది.

### డ్రైవర్ నిర్లక్ష్యంతో

## రోడ్డు ప్రమాదం

### ఇరువురికి తీవ్ర గాయాలు



**బంటుమిల్లి 29 మే (ఆంధ్రపత్రిక) :** బంటుమిల్లి మండలంఅర్ధమురుగ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంపై బంటుమిల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై జి వాసు తెలిపిన వివరాల ప్రకారం మణి మేశ్వరం గ్రామానికి చెందిన అరవ నాగరాజు, అతను మేనల్లుడు ప్రసాద్ తో కలిసి ద్విచక్ర వాహనంపై అర్థమురు పెట్రోల్ కోసం వెళుతుండగా ఎదురుగా వస్తున్న ఆర్టిసి బస్సు అతివేగంగా వచ్చి నాగరాజుని ఢీ కొట్టిందన్నారు. నాగరాజు, ప్రసాద్‌లకు తీవ్ర గాయాలుఅయ్యాయి.గాయపడిన నాగరాజు, ప్రసాద్ లను మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య కోసం విజయవాడ గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై వాసు తెలిపారు.

## సోమలలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు




**సోమల మే 29 (ఆంధ్రపత్రిక) :** చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గ పరిధిలోని సోమల మండలం లో ని తిరుపతి ,పుంగనూరు రోడ్డులో జిల్లా అధికారులు ఆదేశాల మేరకు ఎస్.ఐ.సి.నరసింహులు మరియు సిబ్బంది డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ లు చేపట్టారు. ఈ క్రమం లో పలువురి ద్విచక్ర వాహనాల ను నడుపు తున్న వారి రికార్డులను పరిశీలించారు.రికార్డులు లేని వారిపై ,మద్యం సేవించి నడుపుతున్న వారిపై కేసుల ను నమోదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూన్ 1 వ తేదీ నుండి రవాణా శాఖ ప్రవేశ పెట్టిన నూతన జి.ఓ.ప్రకారం వాహన దారులు రికార్డులను సరిగా తమ వద్ద ఉంచుకోవాలని కోరారు అలా రికార్డులు లేని వారికి అపరాధ రుసుము పాటు కేసులు ను నమోదు చేస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఐ.వెంకట నరసింహులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

### మురుగు కాలువ పూడిక తీసి

## తుఫాను నష్టాన్ని నివారించాలి

### రైతు సంఘం నాయకులు గౌరిశెట్టి నాగేశ్వరరావు



**బంటుమిల్లి 29 మే (ఆంధ్రపత్రిక) :** నాగేశ్వరావుపేట డ్రైను, ఇది నాగేశ్వరావుపేట గ్రామం నుండి బంటుమిల్లి, పెందుర్రు మునిపెడ గ్రామాల మీదుగా మల్లంపూడి డ్రైన్లో కలుస్తుంది. ఇది సుమారు 12 కిలోమీటర్ల పొడవు ఉంటుంది, దీని కింద దాదాపు 5 వేల ఎకరాలు భూములు ఉన్నాయి. ఈ మురుగు కాలవ గత కొన్ని సంవత్సరాల నుండి తవ్వకపోవటం వలన, పూడిక, ఆక్రమణలకు గురి యై ప్రతి సంవత్సరం భారీ వర్షాలు వచ్చినప్పుడు , తుఫాను వచ్చిన సందర్భాల్లోనూ మురుగు ,ముంపు నీరు స్తంభించిపోయి వేలాది ఎకరాలు ముంపు గురియై వివిధ దశల్లో రైతులకి అపార నష్టం కలుగుతుందని రైతులు వాపోతున్నారు , గత సంవత్సరం మీచౌంగ్ తుఫాను సందర్భంలో అక్కడక్కడ తూడు, పిచ్చి మొక్కలు తొలగించడం జరిగిందని రైతులు చెబుతున్నారు.కావున రైతులు వెంటనే ఈ సీజన్లో ఈ డ్రెన్ని తవ్వించి పంటపొలాలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరుచున్నారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి మురుగు కాల్వలు ప్రభుత్వం గత కొన్ని సంవత్సరాల నుంచి పట్టించుకోకపోవడం, అక్కడక్కడ ఆయా సందర్భాల్లో తూడు తొలగిం చడం వలన ఉపయోగం లేదని ,అందువలన ప్రభుత్వం సంబంధిత అధికారులు స్పందించి వెంటనే తవ్వించి రైతుల , కౌలు రైతుల పంటపొలాలకు నష్టం, ఇబ్బందేమీ లేకుండా చేయాలని డిమాండ్ చేస్తున్నారు .ఈ సందర్భంలో బంటుమిల్లి మండల రైతు సంఘం కార్యదర్శి లంకదాసుల అజయ్ ఘోష్,రైతు సంఘం సీనియర్ నాయకులు సుజ్ఞానం జనార్దన్ రావు , కైలా శ్రీ రామాంజనేయులు , కైలా లక్ష్మణరాజు, బొల్లా శ్రీనివాసరావు ,గౌరిశెట్టి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య స్కూల్లో ఏడవ తరగతి వరకే పర్మిషన్..

### ఆపై తరగతులను ప్రారంభిస్తే చర్యలు తప్పవు



**తొట్టంబేడు, మే 29 (ఆంధ్రపత్రిక):** తొట్టంబేడు మండలం లోని శ్రీ చైతన్య స్కూలు ను డిఇఓ ఆదేశాల మేరకు తొట్టంబేడు విద్యాశాఖ అధికారిణి సిహెచ్ మంజు భారతి, శ్రీకాళహస్తి (రెండువ) విద్యాశాఖ అధికారి బాలయ్య లు శ్రీ చైతన్య పాఠశాల ను బుధవారం తనిఖీ చేయడం జరిగినది.ఈ పాఠశాల నందు ఒకటవ నుండి ఏడవ తరగతి వరకు మాత్రమే పర్మిషన్ కలిగి ఉన్నారని తెలిపారు. 8,9,10 తరగతులకు గుర్తింపు లేదని ఈ విషయం విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాలని తెలిపారు.8,9,10 తరగతులు గానీ ప్రారంభించిన శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ధాన్యం బకాయి చెల్లించేలా చేయండి



**శ్రీకాళహస్తి, మే 29 (ఆంధ్రపత్రిక) :** రైతులకు రావాల్సిన ధాన్యం బకాయిలను వెంటనే చెల్లించేందుకు అధికారులు చొరవ చూపాలంటూ ఏర్పేడు మండలం చింతలపాలెం పంచాయతీ వెంకటాపురం గ్రామానికి చెందిన దాన్యం వ్యాపారి లోకేష్ యాదవ్ బుధవారం ఆర్డిఓ రవిశంకర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి మండలం పెంకులపాడు గ్రామం ఊరందూరు రైల్వే గేటు సమీపంలో ఉన్న ఓ మోడ్రన్ రైస్ మిల్లు యాజమాన్యం మార్చి, ఏప్రిల్ మాసాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి రూ.5 లక్షలు మేరా బకాయి చెల్లించాల్సి ఉందని తెలియజేశారు. తనపై రైతుల నుంచి ఒత్తిడి పెరగడంతో మిల్లు యాజమాన్యాన్ని ప్రశ్నించిన ప్రతిసారీ సమాధానం దాటవేస్తూ, దౌర్జన్యానికి దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు చొరవ తీసుకుని ఆ మిల్లు యాజమాన్యం నుంచి రైతులకు రావాల్సిన బకాయిలను వెంటనే వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఆ మోడరన్ రైస్ మిల్లు యజమానిని వివరణ కోరగా, లోకేష్ యాదవ్ చెప్తుంది పూర్తిగా అవాస్తవమనీ, తాము ఆయనకు చెల్లించాల్సింది కేవలం రూ.69 వేలేనని తెలియజేశారు.

### ఎన్నికల కోడ్‌ను అతిక్రమిస్తే

## వేటు తప్పదు

### సీఐ, షేక్‌అబ్దుల్ నబీ హెచ్చరిక



**తిరువూరు మే 29 (ఆంధ్రపత్రిక) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత నెల మే 13వతారీకునసార్వత్రిక ఎన్నికలు జరిగిన విషయం అందరికీ తెలిసిందే జూన్ నాలుగోవ తేదీన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరుగుతున్న దృష్ట్యా ప్రజలందరూ పోలీస్ వారికి సహకరించవలసినదిగా సీఐ షేక్ అబ్దుల్ నబి ప్రజలకు విజ్ఞప్తి చేశారు బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎంతమంది పోటీలో ఉన్న గెలిచేది ఒకరే కాబట్టి గెలిచినవారు ఎటువంటి ఊరేగింపులు కాని,అభిమానులు కవ్వింపు చర్యలకు పాల్పడకుండా ఉండాలని పోలీస్ డిపార్ట్మెంట్ తరఫున విజ్ఞప్తి చేశారు. ఎటువంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమల్లో ఉన్నందున పోలీస్ వారికి సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా అన్ని గ్రామాల్లో సి ఆర్ పి సి 144 సెక్షన్ ఇంకా అమలులో ఉన్నందున కౌంటింగ్ జరిగేవరకు, జరిగిన తర్వాత కూడా ప్రజలంతా సహకరించి, సమన్వయం పాటించి ఏ విధమైన గొడవలకు వెళ్ళరాదని శాంతియుతంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడడం, వెనుక నుండి రెచ్చగొట్టే పనులు చేసిన కవింపు చర్యలకు పాల్పడిన తీవ్రమైన పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు ఇప్పటికే అటువంటి వ్యక్తుల యొక్క వివరాలు సేకరించడం జరిగింది నాయకులు వారి వారి కార్యకర్తలను పార్టీ అభిమానులకు జాగ్రత్తగా ఉండమని సూచించవలసిందిగా పోలీస్ శాఖ తరపున కోరుచున్నాము అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేసి జైలుకు పంపటం జరుగుతుందని హెచ్చరించారు పెట్రోల్ బంకుల్లోను, బాటిళ్లలో లూజు పెట్రోల్ అమ్మటం అక్కడక్కడ పెట్రోల్ విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తించడం జరిగిందిని తెలిపారు వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు కాబట్టి ప్రజలంతా పోలీసువారికి సహకరించి ఏ విధమైన గొడవలకి వెళ్ళకుండా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సహకరిస్తారని కౌంటింగ్ ప్రక్రియ-కౌంటింగ్ తర్వాత కూడా ప్రశాంతంగా ఉండాలని ఎటువంటి అల్లరులకు పాల్పడకుండా మీ వంతు కృషి చేస్తారని వివిధ పార్టీల నాయకులకు కార్యకర్తలకు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం ఈ కార్యక్రమంలో విస్సన్నపేట ఎస్సై జి రామకృష్ణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## రైతు భరోసా కేంద్రాల ద్వారా 50% సబ్సిడీ పై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ



**ఎ.కొండూరు మే 29 (ఆంధ్రపత్రిక) :** ఎ.కొండూరు మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో పచ్చి రొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కావాల్సిన రైతులు పొలం పాస్ బుక్ , ఆధార్ జిరాక్స్ తీసుకుని మీ రైతు భరోసా కేంద్రంలో తీసుకొనవచ్చునని మండల వ్యవసాయ అధికారి షేక్. టిప్పుసుల్తాన్ బుధవారం ఒక ప్రకటన లు తెలియజేసారు. మండలంలో 250 క్వింటాల్ జీలుగలు, 182 క్వింటాల్ పిల్లిపెసర,జనుము 20 క్వింటాల్ మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలియజేసారు. సబ్సిడీ పోను జీలుగలు కిలో రూ. 44/- (క్వింటా 4400), పిల్లి పెసర కిలో రూ.67/-(క్వింటా 6700),జనుము కిలో రూ.44/- (క్వింటా 4400) ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగంచేసుకోవాలని వ్యవసాయ శాఖాధికారి షేక్ టిప్పు సుల్తాన్ కోరారు.

## పవర్ లిఫ్టింగ్‌లో యల్.బి.ఆర్.సి ఈ విద్యార్థుల ప్రతిభ



**మైలవరం, మే 29: (ఆంధ్రపత్రిక):** పవర్ లిఫ్టింగ్ పోటీలలో స్థానిక లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీ రింగ్ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభను కనపరి చారు. ఈ నెల 20 న ఉమ్మడి కృష్ణా జిలా స్థాయి (మెన్ - విమెన్), తిరువూరు ఎన్.టి.ఆర్. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, ద ఫిట్ జోన్ మెంబెర్స్ వారి ఆధ్వర్యంలో పవర్ లిఫ్టింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో 66 కేజీల కేటగిరి, 120ంకేటగిరి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలలో యల్.బి.ఆర్.సి.ఈ, మొదటి సంవత్సరం ఈ.ఈ.ఈ విద్యార్థి కె.కె.సిద్దార్ధ్ 360 బరువు ఎత్తి 2 గోల్డ్ మెడల్స్, 1బ్రాంజ్ మెడల్, అదేవిధంగా తృతీయ సంవత్సరం ఈ.సి.ఈ విద్యార్థి టి.ఎస్.బి.మురళి 360 బరువు ఎత్తి 1గోల్డ్ మెడల్, 2 సిల్వర్ మెడల్స్ ను మరియు మొదటి సంవత్సరం ఈ.ఈ.ఈ విద్యార్థి డి.రామ్ కుమార్ 360 బరువు ఎత్తి 3 గోల్డ్ మెడల్స్ ను సాధించారు. గెలుపొందిన విద్యార్థులు ఈనెల 30 న మంగళగిరిలో జరగబోయే 11వ ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు.ఈ సందర్భంగా మెడల్స్ సాధించిన విద్యార్థుల్నీ, ఫిసికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డా.రాజ్ కుమార్, వాళ్ళకి ట్రైనింగ్ ఇచ్చిన జిమ్ కోచ్ బి.నటరాజ్ లను కళాశాల ప్రెసిడెంట్ జి.శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు అభినందించారు.

### గ్రంథాలయంలో కోలాహలంగా

## వేసవి విజ్ఞాన తరగతులు



**మైలవరం, మే 29 (ఆంధ్రపత్రిక) :** మైలవరం శాఖ గ్రంథాలయం నందు వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థిని, విద్యార్థులకు స్థానిక మాదల బుల్లియ మెమోరియల్ జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు డి.శరత్ బాబు బుధవారం జరిగిన క్లాస్ లో రసాయన శాస్త్రంలో ఎలిమెంట్స్ యొక్క ఆవశ్యకతను విపులంగా వివరించారు. నిత్యజీవితంలో ఎలిమెంట్స్ యొక్క ప్రాముఖ్యతను వివరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు గ్రంథాలయాలు విజ్ఞాన సముపార్జనకు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ముఖ్యంగా వేసవి సెలవులలో విద్యార్థిని విద్యార్థులు రోడ్ల వెంట తిరుగుతూ కాలాన్ని వృధా చేసుకోవడం కాకుండా గ్రంథాలయాలకు వచ్చి పలు అంశాలపై ఇచ్చే శిక్షలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని,విద్యార్థులు పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతిభాన్వితం వసుంధర భరతనాట్య అరంగేట్రం



**విజయవాడ మే 29 (ఆంధ్రపత్రిక):** భారతీయ శాస్త్రీయ నాట్యాల లో భరత ముని పేరిట ఆవిర్భవించి ప్రసిద్ధి చెందిన దక్షిణాత్యా నాట్యం భరతనాట్యం. ఆమె తల్లిదండ్రులు ఆనాట్యంపై వల్లభనేని శ్రీలక్ష్మి వసుంధర శ్రద్ధాభక్తులతో, అకుంఠిత దీక్షతో కృషి చేసి పూర్తి స్థాయిలో ప్రదర్శననిచ్చిన భరతనాట్యారంగేట్రం ఆహూతులను సమ్మోహితులను చేసింది. బుడిబుడి నడకలు వేస్తున్న సమయం లోనే పాటలకు గీతాలకు లయాత్మకంగా అడుగులు వేయడం తల్లితండ్రులు డాక్టర్ వల్లభనేని వంశీ, డాక్టర్ పంకజ శ్రీ లు గమనించి వసుంధరకు గత నాలుగు సంవత్సరాలుగా భరత నాట్యం నేర్పిస్తున్నారు. తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో బుధవారం సాయంత్రం వసుంధర భరతనాట్య అరంగేట్రం నయన మనోహరం గా సాగింది. వారసత్వంగా వస్తున్న నాట్య సంపదను పరిరక్షించు కుంటూ వస్తున్న కుటుంబాలలో భాగవతుల యజ్ఞనారాయణశర్మ కుటుంబం ఒకటి. వారి కుమారులు భాగవతుల వేంకటరామశర్మ, వారి కుమార్తె సౌమ్యల దగ్గర సుశిక్ష ణలో వసుంధర నాట్యాభ్యాసం చేస్తూ పూర్తిస్థాయిలో ప్రదర్శననిచ్చి అందరి ప్రశంసలందుకుంది. ఆంగికాభినయం ప్రధానంగా ఏకపాత్ర కేళికతో ఆవిర్భావం నుంచి వచ్చిన సంప్రదాయాన్ని పోషిస్తూ వసుంధర భరతనాట్యం అంశాల ను భావ తాళ లయాత్మ కంగా ప్రదర్శించి తన కృషిని ప్రకటితం చేసింది. వసుంధర నాట్య ప్రదర్శన నాట రాగంలో పుష్పాంజలితో ప్రారంభించి చతురస్ర నడకలో అలరింపు, తోడి రాగంలో జతి స్వరం, రాగ మాలికలో సరసిజాక్షులు శబ్దం, ధన్యాసిలో ఏ మగువ పద వర్ణం, మధ్యమావతి రాగంలో నగుమోము కీర్తన, కామవర్ధిని రాగంలో అష్టపది, అఠాణ రాగంలో థిల్లాన వంటి అంశాలతో ప్రదర్శించి ఆహూతులను సమ్మోహితులను చేసింది.

భాగవతుల వేంకటరామ శర్మ, భాగవతుల సౌమ్యలు నట్టువాంగం చేయగా గాత్ర సహకారం చిముడూరి సుధా శ్రీనివాస్ అందించార.వయోలిన్ తో పాలపర్తి ఆంజనేయులు, వీణతో కె శశిధర్, వేణువుతో ఎస్ కె బాబు, మృదంగంతో బి సురేష్ బాబులు ఆమె నాట్యానికి నిండుదనాన్ని చేకూరుస్తూ సహకరించారు. గురు సత్కారం.. అదే వేదికపై వసుంధర తనకు భరతనాట్య శిక్షణ నిచ్చిన గురువులకు వేద ఘోష జరుగుతుండగా సంప్రదాయ బద్ధంగా గురు పూజ చేసి ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమా నికి వల్లవినేని వంశీ ఆత్మీయు లు సన్నిహితులు బంధుమిత్రులు శ్రేయోభిలాషులు కాక చిన్ననాటి స్నేహితుడు ఎమ్మెల్యే కొడాలి నాని వంగవీటి రాధ సతీమణి తదితర మిత్రులు పాల్గొన్నాని చిన్నారిని ఆశీర్వదించారు.

### శాస్త్రోక్తంగా శ్రీ కల్యాణ శ్రీనివాసుడి

# చక్రస్నానం



**తిరుమల,మే 29 (ఆంధ్రపత్రిక):** నారాయణవనం శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన బుధవారం ఉదయం చక్రస్నానం శాస్త్రోక్తంగా జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున స్నానాలు ఆచరిం చారు. అంతకుముందు ఉదయం 8.30 నుండి 9.30 గంటల వరకు స్వామి, అమ్మ వార్లకు పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ఉదయం 10 నుండి 11 గంటల వరకు పుష్కరిణి ఎదురుగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వస్వామివారికి, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపనతిరుమంజనం వైభవంగా నిర్వహించారు. అనంతరం చక్రస్నానం ఘనంగా జరిగింది. సాయంత్రం 6 నుండి 7 గంటల వరకు నవసంధి, మాడవీధి ఉత్సవం నిర్వహించారు. రాత్రి 7 నుండి 7.30 గంటల మధ్య జరిగిన ధ్వజావరో హణంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిసాయి. ఈ కార్యక్రమం లో ఆలయ డెప్యూటీ ఇఓ నాగరత్న, ఏఇఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

### వాల్మీకి రిజర్వేషన్

## పోరాట సమితి కమిటీలోకి ఇద్దరు ఎంపిక



**చెన్నేకొత్తపల్లి, మే 29(ఆంధ్రపత్రిక):** శ్రీ సత్యసాయి జిల్లా వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి కమిటీలోకి ఇద్దరు నూతన వ్యక్తులను తీసుకోవడం జరిగి నది. బుధువారం వాల్మీకి రిజర్వేషన్ల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ సుభాష్ చంద్రబోస్ ఆదేశాల మేరకు రాష్ట్ర యువజన సంఘం ప్రధాన కార్య దర్శి చీమల జయ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో కమిటీలోకి నూతనంగా వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా యూత్ కార్యదర్శిగా చెన్నేకొత్తపల్లి మండలం ఓబుళంపల్లి గ్రామానికి చెందిన వీర ప్రతాప్‌ను అలాగే రాప్తాడు నియోజకవర్గ యూత్ అధ్యక్షులుగా చెన్నేకొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన కొత్తబావి పవన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ నూతన కమిటీలో చేరిన సభ్యులకు వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి చీమల జయ శుభాకాం క్షలను తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి యూత్ అధ్యక్షులు మందల జగన్ మోహన్ అలాగే అంకె ఓబుళపతి,సాకే ప్రశాంత్‌లు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ కోదండరామస్వామివారి ఆస్థానం



**తిరుమల, మే 29(ఆంధ్రపత్రిక):** అన్నమ య్య జయంతి ఉత్సవాల్లో భాగంగా అన్నమా చార్య కళా మందిరంలో బుధవారం ఉద యం 8 నుండి 9 గంటల వరకు శ్రీ కోదం డ రామస్వామివారి ఆస్థానం ఘనంగా జరిగింది. ముందుగా స్వామివారి ఉత్సవ మూర్తులను శ్రీ కోదండరామ స్వామివారి ఆలయం నుండి అన్న మాచార్య కళామంది రానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు సంకీర్తన గానం నిర్వహించారు. అనంతరం తిరిగి స్వామివారి ఉత్సవమూర్తులను శ్రీ కోదండరామాలయానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఉదయం 9 నుండి 10 గంటల వరకు అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు శ్రీ మధుసూదన్, శ్రీమతి సుశీల బృందం " రామచంద్రుడితడు రఘు వీరుడు, జయతు జయతు మంత్రం జన్మ సాఫల్య మంత్రం, జయ జయ రామ., రాముడు రాఘవుడు రవికులు డితడు.., తదితర సంకీర్తనలను సుమధురంగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో అన్నమా చార్య ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ విభీషణ శర్మ, శ్రీ కోదండరామస్వామి ఆలయ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అమరవీరులకు ఘనంగా నివాళులు



**ధర్మవరం, మే 29 (ఆంధ్రపత్రిక):** రైతులు, కార్మికులు బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అప్పటి భూస్వాములను ఎదిరించి, పోరాటాల ధీరత్వాన్ని పునికి పుచ్చుకొని భూ పోరాటాలు ద్వారా దున్నేవాడిదే భూమి అన్న నినాదంతో పేద ప్రజల కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి వీరోచితంగా పోరాటాలు చేసి తుదకు భూస్వాముల కుట్రలకు బలి అయ్యి పేద ప్రజల కోసం ప్రాణాలను అర్పించిన పోరాటాల మహోన్నతుడు కామ్రేడ్ పరిటాల శ్రీరాములయ్య, కామ్రేడ్ సుబ్బయ్య, కామ్రేడ్ లింగన్న, కామ్రేడ్ రామాంజనేయులు ఒకే రోజు ప్రాణాలను అర్పించారు వీరి నలుగురిని స్మరించుకుని బుధవారం ధర్మవరం డివిజన్ పరిధిలోని రామగిరి మండలంలోని నసనకోట గ్రామ పంచాయతీ లో ఉన్న కొత్తగేరి గ్రామంలో వీరి యొక్క చిత్ర పటాలులకు పూలమాలలు వేసి, వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించి, వీరికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంలో అప్పట్లో వారితో ఉన్న అవినాభావ సంబంధాలు ను పంచాయతీ ప్రజలు స్థానిక అమరవీరుల కుటుంబ సభ్యులు జ్ఞాపకం చేసుకొని వారిని స్మరించి కున్నారు. ఈ కార్యక్రమంలో అమర వీరుల కుటుంబ సబ్యులతో పాటుగా పంచాయతీ ప్రజలు, కన్వీనర్ సుధాకర్, తెలుగు యువత అధ్యక్షులు లింగాశ్రీధర్ నాయుడు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు వెంకట రాముడు, నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పోతన్న, నసనకోట ఎంపీటీసీ శ్రీనివాసులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### వైవిబి రాజేంద్రప్రసాద్‌కు

## పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన జిల్లా నేతలు



**బంగారుపాళ్యం–మే 29(ఆంధ్రపత్రిక):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవిబి రాజేంద్రప్రసాద్ పుట్టినరోజును పురస్కరించుకుని విజయవాడలో ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ నాయకులు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనంజయ యాదవ్,రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం కార్యదర్శి కుప్పాల మురళి,రాష్ట్ర పంచాయతీ రాజ్ కార్యదర్శి చింతా కిరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### వేడుకగా మహాభారతంలో

## ఆఖరు ఘట్టం దుర్యోధన వధ కార్యక్రమం



**బంగారుపాళ్యం–మే29(ఆంధ్రపత్రిక):** చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలంలోని చీకూరుపల్లిలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా బుధవారం ఆఖరి ఘట్టం దుర్యోధన వధ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కృష్ణ,భీమ, దుర్యోధన పాత్రధారులు తమ పాటలు పద్యాలతో ప్రేక్షకులను అలరించారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా చీకూరుపల్లి గ్రామానికి చెందిన వల్లేమ్మ వాళ్ళ వెంకటేష్,సుబ్రమణ్యం కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ దినం అన్నదానం చేసిన వారు పామినివాండ్లఊరుకు చెందిన చీకూరు విమలమ్మ చంద్రయ్య కుటుంబ సభ్యులు వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి చీకూరు పల్లి,కె.జి,సత్రం,సీఆర్ కాలనీ,కల్లూరుపల్లి, కాటప్పపల్లి, పామిని వాండ్లఊరు గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అన్న దాడి ఘటనలో తమ్ముడు మృతి



**గూడూరు, మే 29 (ఆంధ్రపత్రిక):** గూడూరు మండల పరిధిలోని చంబడి పాలెం గ్రామంలో సోమవారం నాడు జరిగిన ఘర్షణలో పురిణి అశోక్ అనే 30 సంవత్సరాల యువకుడు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. గూడూరు రూరల్ పోలీస్‌ల సమాచారం మేరకు గూడూరు మండల పరిధిలోని చంబడి పాలెం గ్రామంలో నివసిస్తున్నపురిణి మస్తానయ్య మరియు అతని తమ్ముడు అశోక్ లకు అదే గ్రామానికి చెందిన మధుసూదన్ కుమారుడు గురవయ్యకు మధ్య వ్యక్తిగత కారణాలతో ఘర్షణ మొదలైందన్నారు. ఈ క్రమంలో మస్తానయ్య అశోక్ ఇద్దరు కలిసి గురవయ్య ఇంటికి వెళ్లి గొడవ పడి గురవయ్య తండ్రి మధుసూదన్ పై మస్తానయ్య కర్రతో దాడి చేయడంతో అడ్డుకోబోయిన అశోక్‌కు కర్ర తగడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన అశోక్‌ను చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించ గా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. పొరపాటున అన్న చేతిలో కర్ర సొంత తమ్ముడుకు తగిలి మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు నెలకొన్నాయి ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రైవేటు విద్యా సంస్థలుపై చర్యలు తీసుకోవాలి

### ఎం.ఇ.ఓ.ను సస్పెండ్ చేయాలి

### జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు చేసిన ఎ.ఐ.ఎస్.ఎఫ్.నాయకులు



**ధర్మవరం, మే 29(ఆంధ్రపత్రిక):** ధర్మవరం పట్టణంలో ఉన్నటువంటి ప్రైవేట్ విద్య సం స్థలపై చెర్యలు తీసుకోవాలని అలాగే ఎం. ఇ. ఓ ను సస్పెండ్ చేయాలని కోరుతూ బుధువారం కొత్తచెరువులోని జిల్లా విద్యాధికారి కార్యాలయం లో జిల్లా విద్యాధి కారి మీనాక్షి మేడమ్‌కు ధర్మ వరం నియోజకవర్గ ఎ. ఐ. ఎస్. ఎఫ్ ప్రధాన కార్యదర్శి శివ తో పాటు మరికొందరు వినతిపత్రం ను ఇచ్చారు. ఈ సమయంలో జిల్లా విద్యాధి కారికి తెలియ చేస్తూ గవర్నమెంట్ జీవో రాకముందే అక్రమ అడ్మిసన్స్ లకు పాలపడుతున్నారని, ప్రైవేట్ విద్య సంస్థలో అక్రమంగా బుక్స్ అమ్ముతున్నారని తెలిపారు ముఖ్యంగా కాకతీయ స్కూల్, జీనియస్ స్కూల్, యశోద స్కూల్, వంశీ కృష్ణ, జీవనందా స్కూల్, జీవన్ జోతి స్కూల్, పి.సి.ఎం.ఆర్ స్కూల్, ఆదిత్య స్కూల్, పై చర్యలు తీసుకోవాలి అన్నారు. ధర్మవరం పట్టణం లో విచ్చ ల విడిగా, స్వేచ్ఛ గా అక్రమముగా అడ్మిషన్ లకు పాల్పడుతున్నా ప్రవేట్ విద్య సంస్థలు పాఠ్య పుస్తకాలు కొరకు రూ, 2000 నుంచి 5000 వరకు అమ్ముతున్నారని, విద్యార్థుల తల్లిదండ్రులతో వేలాది రూపాయలు వసూళ్లు చేస్తున్న ప్రైవేట్ విద్య సంస్థలపై చర్యలు తీసుకోవాలని అలాగే వీరికి సహకరిస్తూ ప్రైవేట్ విద్య సంస్థలకు ఎం.ఇ. ఓ అమ్ముడు పోతున్నారని, ఈయన ప్రైవేట్ స్కూల్‌లకు అసోసియేషన్ గా ఉన్నారా ? లేదా గవర్నమెంట్ అధికారిగా ఉన్నారో అర్థం కావడం లేదు,అన్నారు. ప్రైవేట్ స్కూల్ యాజమాన్యానికి అమ్ముడు పోయారో అర్థం కావడం లేదు అని వెంటనేవ్ ఎం.ఇ. ఓ ను తక్షణమే సస్పెండ్ చేయాలని డి. ఇ. ఓ.కు పిర్యాదు చేసారు. ఈ కార్యక్రమంలో ఏ.ఐ.ఎస్.ఎఫ్ ధర్మవరం పట్టణ నాయకులు ప్రదీప్, నవీన్‌లు పాల్గొన్నారు.

### చెన్నేకొత్తపల్లి మండలంలో

## రైతులకు సబ్సిడీ వేరుశనగ పంపిణీ



**చెన్నేకొత్తపల్లి, మే 29 (ఆంధ్రపత్రిక):** రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ లో రైతులకు కె.6 రకం వేరుశనగ ను 40 శాతం సబ్సిడీ తో ఇస్తున్న వేరుశనగ బస్తాలను మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద ఉన్న రైతు భరోసా కేంద్రం ఒకటిలో అలాగే రెండవ రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ అధికారి ఉదయ్ కుమార్‌తో కలిసి చెన్నేకొత్తపల్లి మండల ఎంపీడీఓ మోహన్ కుమార్ చేతుల మీదుగా ముందుగా నమోదు చేసికున్న రైతులకు సబ్సిడీ వేరుశనగను పంపిణీ చేశారు. ఈ సందర్భంలో ఎంపీడీఓ మోహన్ కుమార్ రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సబ్సిడీ ద్వారా వేరుశనగను ఇస్తున్నందున ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం ఎ. ఓ.ఉదయ్ కుమార్ మాట్లాడుతూ 30 కె.జీ ల బస్తాలను ఒక్కొక్క రైతుకు వారికున్న వ్యవసాయ విస్తీర్ణ మును బట్టి ఒక బస్తానుండి మూడు బస్తాల వరకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్నది అన్నారు. చెన్నేకొత్తపల్లి మండలంలోని 13 రైతు భరోసా కేంద్రాలకు 1300 క్వింటాలు వేరుశనగ వచ్చిందని , ఒక్కొక్క రైతు భరోసా కేంద్రంలో 100 క్వింటాళ్ల చొప్పున నిలవ ఉంచామని అన్నారు. ఇప్పటివరకు ముందుగానే 1316 మంది రైతులు 1170 క్వింటాలు కు 40 శాతం స బ్సిడీ వేరుశనగ కావాలని ముందుగానే దరఖాస్తు చేసుకున్నారని వీరందరికి ఈ రోజు ఆయా రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు.

**ఎల్.ఆర్.జి 52 రకం కందులను 40 శాతం సబ్సిడీతో ఇస్తాం**

చెన్నేకొత్తపల్లి మండలంలోని రైతులు 40 శాతం సబ్సిడీ ఇస్తున్న కె 6 రకం వేరుశనగ తో పాటుగా 40 శాతం సబ్సిడీ ద్వారా ఎల్.ఆర్.జి.52 రకం కందులను సహితం రైతులకు పంపిణీ చేయడం జరుగు తుంది కావున కందులు కావాల్సిన రైతులు ముందుగా రైతు భరోసా కేంద్రాలలో నమోదు చేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు.

## మండల సర్వ సభ్య సమావేశం



**గూడూరు, మే 29 (ఆంధ్రపత్రిక):** గూడూరు పట్టణం లోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గురవ య్య ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సాధారణ సమా వేశం నిర్వహించారు. పలు శాఖల అధికారులు ఎంపీటీ సీలు సర్పంచులు పాల్గొన్నారు. పలు సమస్యలపై చర్చిం చారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ శ్రీనివాసులు రెడ్డి, ఇంద్రాణి, ఎంపీడీవో రాజశేఖర్, ఎం. ఈ.వో కాంచన, పలు శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పాఠశాల్లాల్లో పిల్లలకు పరిశుభ్రంగా వండి పెట్టాలి



**ధర్మవరం, మే 29(ఆంధ్రపత్రిక):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పరిశుభ్రంగా రుచికరంగా వండి పెట్టాలని ధర్మవరం మండల విద్యా ధికారి గోపాల్ నాయక్ అన్నారు. బుధువారం స్థానిక సుందరయ్య నగర్ లోని శ్రీ గణేష్ మున్సిపల్ హై స్కూల్ నందు ఎం.డీ.ఎం సి సి హెచ్ శిక్షణ అలాగే కుకింగ్ పోటీలను నిర్వహించారు. ఈకార్య క్రమంలో ఎం.ఇ. ఓ గోపాల్ నాయ క్, అలాగే పి.రాజేశ్వరిలు మాట్లాడుతూ పిల్లలకు శుచి, శుభ్రమైన నాణ్యమైన భోజనం అందించాలని, మధ్యాహ్న భోజనం నందు ఎలా చేయాలి పదార్థాలు ఎంత మోతాదులో వాడాలి అన్న విషయాలను మండల విద్యాశాఖ అధికారులు వివరించారు. అందరితో బోజననాలు వండించారు. తరువాత జరిగిన కుకింగ్ కాంపిటీషన్స్ లో మొద టి విజేత సి.లక్ష్మీదేవి ఎం.పి.ఎల్.హెచ్ ఎస్ బాలుర కొత్తపేట, రెండవ విజేత ఎం రత్నమ్మ బి.ఎస్.ఆర్ బాలుర ఎం.పి.ఎల్. హెచ్.ఎస్.సంజయ్ నగర్,మూడవ వ విజేత టి మంజరి జి.వి.ఇ జడ్ పి హెచ్, ఎస్ గెలుపు పొందినారు. ఈ కార్యక్రమములో మండల విద్యాశాఖ అధికారులు టి. రాజేశ్వరి దేవి అలా గే బి.గోపాల్ నాయక్, ఎం.ఈ.ఓ ఆఫీస్ సిబ్బంది, సి ఆర్ ఎం టి ఎస్, పి.టి.ఐ. ఎస్‌లు పాల్గొన్నారు.

### రైతులు వేరుశనగ విత్తనాలు

## సద్వినియోగం చేసుకోవాలి

### విత్తన పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించిన వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీ ఎస్. కృష్ణయ్య



**ధర్మవరం, మే 29 (ఆంధ్రపత్రిక):** రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌లో రైతులకు 40 శాతం సబ్సిడీతో ఇస్తు న్న వేరుశనగ పంపిణీ కార్యక్రమా న్ని వ్యవసాయ సహాయ సంచాల కులు ఎస్.కృష్ణయ్య బుధువారం పోతుకుంట రైతు భరోసా కేంద్రంలో వేరుశనగ విత్తన పంపిణీ కార్యక్ర మాన్ని మండల వ్యవసాయ అధికారి ముస్తఫాతో కలిసి ఎ. డి.ఎ కృష్ణయ్య పరిశీలించారు. రైతులు వేరుశనగ విత్తనాలు సద్విని యోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. విత్తనం దుర్వినియోగం జరిగితే ప్రభుత్వం నుండి రావలసిన పథకాలకు అనర్హులు అవుతారని తెలియజేసారు. ఇంతవరకు ధర్మవరం మండలంలో 2513 మంది రైతులు 2233 క్వింటాళ్ల వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగింది. అని అన్నారు.

## కొటాలలో పోలీసుల నిర్బంధ తనిఖీ..



**యాదమరి, మే29 (ఆంధ్రపత్రిక):** మండలంలోని కొటాల గ్రామంలో బుధవారం యాదమరి పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ సూచనల మేరకు, మండల పరిధిలోని కొటాలం గ్రామంలోని వాహనాలు రికార్డులు యాదమరి ఎస్సై రామాంజినేయులు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేశారు. తనిఖీల్లో సరైన పత్రాలు లేని ఏడు వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామ సమీపంలో నాటు సారా తయారీకి ఉపయోగించే 50 లీటర్ల సారా ఊటను ఈ సందర్భంగా ధ్వంసం చేసినట్లు తెలిపారు.

# నియోజకవర్గంలో అంబరాన్ని అంటిన మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు జన్మదిన సంబరాలు







**చిలకలూరిపేట, మే 29, (ఆంధ్రపత్రిక):** పట్టణంలో బుధవారం ఉదయం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మూడు దశాబ్దాలు పైబడిన రాజకీయ జీవితంలో అజాతశత్రు వుగా, అందరివాడిగా పేరు సంపాదించుకున్న ప్రత్తిపాటి నిండు నూరేళ్లా ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని ఆయన పేరిట సర్వమత ప్రార్ధనలు నిర్వహించారు. నియోజకవర్గంలో పేద ప్రజల ప్రతి అవసరానికి అండగా ఉంటూ, పిలిస్తే పలికే ప్రత్తిపాటి కుటుంబం చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. ఆయన తలపెట్టిన ప్రతి సంకల్పం నెరవేరాలని, భవిష్యత్ మరింత ఉన్నతస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నాం అన్నారు. ముందుగా కళామందిర్ సెంటర్‌లోని శివాలయంలో తెలుగు మహిళలు, నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్తిపాటి, ఆయన కుటుంబం క్షేమాన్ని కాంక్షిస్తూ కుమ్మర కాలనీలోని హొసన్నా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మైనారిటీ సెల్ ఆధ్వర్యంలో దువా చేశారు.

తదనంతరం పార్టీ నాయకులు ప్రత్తిపాటి జన్మదిన కేక్ ను కట్ చేసి హ్యాపీ బర్తే ప్రతిపాటి,హ్యాపీ బర్తే ప్రత్తిపాటి అని శుభాకాంక్షలు తెలిపారు.

తదనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బాపూజీ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్ అప్పర్ ప్రైమరీ స్కూల్ విద్యార్థి డాక్టర్ పునుగుపాటి నీలాంబరంకు పూర్వ విద్యార్థుల ఘన సన్మానం



**గుంటూరు : మే 29 ( ఆంధ్రపత్రిక ) :** ప్రముఖ సీఎస్ఐఆర్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ హైదరాబాద్ పరిశోధనా సంస్థలో పాలిమర్ కెమిస్ట్రీలో పీహెచ్డీ సాధించిన డాక్టర్ పునుగుపాటి నీలాంబరంను స్కూల్ పూర్వ విద్యార్థులు ఆయన నివాసం వద్ద ఘనంగా సత్కరించారు. ఆయన పర్యావరణ సహిత ఏమల్షన్స్ మీద పరిశోధన చేసి థీసిస్ సమర్పించినందుకు ఏ.సి.ఎస్ ఐ.ఆర్ నుంచి పీహెచ్డీ పట్టా పొందారు. పాలిమర్స్ , ఫంక్షనల్ మెటీరియల్స్ విభాగం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ లో "సింథసిస్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ యాక్రిలిక్ హైబ్రిడ్ ఎమల్షన్స్ అండ్ కాంపోజిట్స్ ఫర్ కోటింగ్ అప్లికేషన్స్" పై డాక్టర్ రామానుజ్ నారాయణ్, మరియు అరిందమ్ చక్రబర్తి, పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గానూ ఏ.సి.ఎస్ ఐ.ఆర్ నుంచి పీహెచ్డీ పట్టా పొందారు. ఈ సందర్భంగా స్.ర్.ఎం.టి. సి. యూ. పి.స్కూల్ పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులు, మరియు రిటైర్డ్ హెడ్ మాస్టర్ రేజేటి వెంకటేశ్వర్లు సైన్స్ మాస్టారు డాక్టర్ పునుగుపాటి నీలాంబరం సాధించిన విజయానికి అభినందనలు తెలిపారు. తనలో శాస్త్రీయ అవగాహన జిజ్ఞాస దృక్పథం పెంచడంలో సైన్స్ మాస్టర్ రేజేటి వెంకటేశ్వర్లు మరియు స్.ర్.ఎం.టి. సి. యూ. పి.స్కూల్ ఉపాధ్యాయులు ఎంతో ప్రోత్సహించారు అని డాక్టర్ నీలాంబరం తెలిపారు.

## కోరుకొండలో పోలీస్‌ల మాక్ డ్రిల్

### శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల్లో చైతన్యం





**కోరుకొండ, మే 29 (ఆంధ్రపత్రిక) :** శాంతి భద్రతల పరిరక్షణ కోసం సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఏ విధమైన వివాదాలు, ఘర్షణలు తలెత్తకుండా చూడడం కోసం ఉత్తర మండల పోలీస్ కేంద్రమైన కోరుకొండలో బుధవారం సాయంత్రం కోరుకొండ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అడపా నాగ మురళి, ఏ ఆర్ పార్టీ ఆర్ ఎస్ ఐ ఎం హరి ప్రసాద్, జి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాబ్ ఆపరేషన్ మార్క్ డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈసందర్భంగా కోరుకొండ ఆర్టిసి బస్టాండ్ సెంటర్లో ప్రత్యేక బలగాలతో ఉత్తర మండల పరిధిలోని పోలీసుస్ లతో కలిసి ఈ కార్యక్రమం జరిగింది. ఓట్ల లెక్కింపు సందర్భంగా తలెత్తే అవకాశాలు ఉన్న పరిస్థితులు దృష్టిలో పెట్టుకుని ముందస్తు అవగాహన కల్పిస్తూ, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే కార్యక్రమంలో భాగంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎలాంటి అవంతరాలు, హింసాత్మక ఘటనలు జరిగితే ఎలా ఎదురక్కోవాలో ముందస్తుగా పోలీసులు చర్యలు తీసుకుని ప్రజలకు అవగాహన కలిగే విధంగా చర్యలు చేపట్టారు.కౌంటింగ్ సమయంలో ఘర్షణలుపై లాఠీ చార్జ్, భాష్పవాయులు ప్రయో గం, పోలీస్ కాల్పులపై ముందస్తుగా బలగాలతో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈసందర్భంగా రాజమండ్రి గోకవరం వెళ్లే రోడ్డులో ట్రాఫిక్కును ప్రత్యామ్నాయ మార్గంలో మళ్ళించారు. అనంతరం సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగ మురళి మాట్లాడుతూ, ఎన్నికల కౌంటింగ్ పురస్కరించుకొని శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఏ విధమైన చర్యలు చేపట్టవద్దని సూచించారు. అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, కేసులు నమోదు చేసి షీట్ ఓపెన్ చేయటం జరుగుతుందని హెచ్చరించారు. ఎన్నికల ఫలితాలు తర్వాత ఏ విధమైన ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించవద్దని సూచించారు. ఈకార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్ట ర్ నాగ మురళితోపాటు కోరుకొండ ఎస్సై ఆనంద్ కుమార్, గోకవరం ఎస్ఐ నాగరాజు, సీతానగరం ఎస్సై రామకృష్ణ కోరుకున్న సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పలువురిని పరామర్శించిన కూటమి అభ్యర్థి కందులదుర్గేష్



**నిడదవోలు, మే29 (ఆంధ్రపత్రిక) :**నిడదవోలు నియోజకవర్గం కూటమి అభ్యర్థి కందుల దుర్గేష్ బుధవారం నిడదవోలు మండలం గోపవరం గ్రామంలో ఒక వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

అనంతరం కంసాలిపాలెం ఉండ్రాజవరం మండలం పాలంగి పెరవలి మండలం పెరవలి మరియు వెంకటరాయపురం గ్రామాలలో పలువురిని పరామర్శించారు. దుర్గేష్ వెంట తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బూరుగు పల్లి శ్రీనివాస్ అతికాల రామ కృష్ణమ్మ సింహాద్రి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

### మురికికూపంలో మండలకేంద్రం

## ఆంధ్రపత్రిక వార్తకు స్పందన



**కొరిశపాడు,మే 29 (ఆంధ్రపత్రిక):** మురికి కూపంలో కొరిశపాడు మండల కేంద్రం అని మే 4వ తేది ఆంధ్రపత్రిక ప్రధాన సంచికలో ప్రచురితమైన విషయం పాఠకులకు విధితమే.ఈ వార్తకు స్పందించిన అధికారులు ఎట్టకేలకు ప్రోక్లైన్ తో పూడిక తీయించారు. అంబేద్కర్ నగర్ ప్రధాన కాలువ పూడిక తొలిగించడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్త చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచి ఈపూరి విజయ్ కుమార్ జెడ్పిటిసి తుళ్ళూరి వెంకటరమణ పంచాయతీ కార్యదర్శి మర్రివాడ కనకదుర్గ పంచాయతీ వర్కర్ యేసు పాదం తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదం వారికి వంతల రాజేశ్వరి సహాయం



**కూనవరం,మే 29 (ఆంధ్రపత్రిక):** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం కూనవరం మండలం గోమ్ముగూడెం గ్రామంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో రెండు ఇల్లు దగ్ధం అయ్యాయి.బాధితుల సహాయార్థం వెంటనే మాజీ ఎమ్మెల్యే రంపచోడవరం నియోజకవర్గం ఇన్చార్జి వంతల రాజేశ్వరి వారి సహాయార్థం ఒక్కొక్క ఇంటికి 4000 చొప్పున ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంటు అధికార ప్రతినిధి ఎడవల్లి భాస్కరరావు మండల పార్టీ అధ్యక్షులు బరపాటి ప్రకాశరావు మాజీ అధ్యక్షులు గాడేసుల ప్రేమ చందు బీసీ సెల్ అధ్యక్షులు నగేష్ యూత్ అధ్యక్షులు లంకహరిబాబు కర్నాటి శ్రీను దాసరి నాగేశ్వరావు ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### ముక్తేశ్వరం పాలిటెక్నిక్ కళాశాల నందు జాబ్ అచీవర్స్ డే




**అయినవిల్లి,మే 29 (ఆంధ్రపత్రిక):** అయినవిల్లి మండలంలోని ముక్తేశ్వరం నందు గల పాలిటెక్నిక్ వైవిఎస్,బి.అర్.యం. పాలిటెక్నిక్ కళాశాల నందు పాలిటెక్నిక్ జాబ్ అచీవర్స్ ఢే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈసందర్బంగా ఈసవత్సరం వివిధ కంపెనీల ద్వారా ఎంపికైన.ఈసిఈ.ఈఈఈ, మేకానికల్, ఇనాసట్రు మేంటుషన్ మరియు కంప్యూటర్ కు చెందిన వైవిఎస్,బి.అర్ యం. పాలిటెక్నిక్ విద్యార్దులకు జాబ్ అఫర్ లేటర్ అందించడం జరిగింది అని వారు తెలిపారు ఈకార్యక్రమనికి ముఖ్య అతిదిగా వి.శ్రీనివాస్, బి.సుదకర్, హాజరయ్యారు కళాశాల ప్రిన్సిపాల్ కె.విశాల మాట్లాడుతూ విద్యార్థులకు మరెన్నో కంపెనీలు ద్వారా ఉపాది అవకాశాలు కల్పించడం జరుగుతుంది అని వారు తెలిపారు.

### ప్రభుత్వజూనియర్ కళాశాలలు లేని మండల కేంద్రాలు

# కొరిశపాడు, జెపంగులూరు

**కొరిశపాడు, మే 29 ( ఆంధ్రపత్రిక):** అద్దంకి నియోజకవర్గంలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాల లేనిమండలాలు కొరిశపాడు జె పంగులూరు మాత్రమే నియోజకవర్గంలోనే ఐదు మండలాలు ఉండగా అద్దంకిలో 1972 లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుచేశారు. తరువాత కాలంలో సంతమాగులూరు మండలకేంద్రంలో బల్లికురవ మండలకేంద్రంలో కూడా జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేశారు. పూర్వపుసమితి మండల కేంద్రం అయిన కొరిశపాడు మరియు మరొక మండల కేంద్రమైన జె పంగులూరులో మాత్రం నేటికీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయలేదు. 1992 లో మాగుంట సుబ్బరామిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రావినూతలలో ఒక జూనియర్ కళాశాల జె పంగులూరులో ఒక జూనియర్ కళాశాల ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేశారు ఈ రెండు మండలాలు కూడా చెన్నై కలకత్తా జాతీయ రహదారికి అందుబాటులో ఉంటాయి కొరిశపాడు మండలంలో ప్రధానంగా మేదరమెట్ల, తిమ్మనపాలెం,దైవాలరావూరు,రావినూతల కొరిశపాడు,పమిడిపాడు గ్రామాలలో ఆరుజిల్లాపరిషత్ హైస్కూల్లు మూడు ప్రైవేటు హైస్కూల్ లతో కలిపి మొత్తం తొమ్మిది హైస్కూళ్లు ఉన్నాయి. జె పంగులూరుమండలంలో అలవలపాడు చందలూరు ముప్పవరం కొండమం జులూరు, బూదవాడ జెపంగులూరులలో ఆరు జిల్లాపరిషత్ హైస్కూళ్లు ఉన్నాయి. ఆయా హైస్కూళ్ల నుండి ప్రతివిద్యా సంవత్సరము దాదాపు 1000 మంది పైగా విద్యార్థులు పదోతరగతి పాస్అయి ఈ రెండుమండలాల్లో ప్రభుత్వజూనియర్ కళాశాలు లేక దూర ప్రాంతాలలో ప్రైవేటు జూనియర్ ఇంటర్ కళాశాలలో చేరుతున్నారు. ప్రభుత్వం కూడా విద్యాదీవెన నిధులు ప్రభుత్వ ప్రవేట్ కళాశాలలో చదివిన వారికి ఇస్తున్నందువల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ రెండు మండలాలలో అందుబాటులో లేనందున లక్షల పైగాఫీజులు వెచ్చించి ప్రైవేట్ కాలేజీలలో విద్యార్థులను తల్లిదండ్రులు చేరుస్తున్నారు. ఇంటర్మీడియట్ అనేది చదువులో మధ్యస్థ, టినేజ్ దశ కావున తల్లిదండ్రులు జాగ్రత్త పడుతుంటారు. కొరిశపాడు జె పంగులూరు ఈరెండుమండలాల్లో ఉన్న చారిటబుల్ ట్రస్ట్ జూనియర్ కళాశాలలో సరైన సిబ్బంది,కళాశాలలో వసతులులేక సరైనబస్సు సౌకర్యం లేక విద్యార్థులు దూర ప్రాంతాలు అయినా గుంటూరు విజయవాడ,ఒంగోలు, ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం, మరియు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు స్పందించి కొరిశపాడు మరియు జెపంగులూరు రెండు మండలాల్లో మండల కేంద్రాల్లో గానీ బస్సు వసతిఉన్నమధ్యస్థ ప్రాంతాల్లో గానీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

# హరిత నగరంగా గుంటూరు

### మానవత స్వచ్ఛంద సేవ సంస్థ






**గుంటూరు, మే 29 ( ఆంధ్రపత్రిక):** గుంటూరు నగరాన్ని హరిత నగరంగా మార్చాలని రాబోవు వర్షాకాలంలో వేలాది మొక్కలను నాటి ప్రతి మొక్కను బ్రతికించాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఈనెల 29న మానవత కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో తీర్మానించింది. మానవత సంస్థ చైర్మన్ పావులూరి రమేష్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మానవత ముఖ్య సలహాదారు శ్రీ వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి ప్రసంగిస్తూ గుంటూరు నగరంలోని ప్రతి ఇంటికి పండ్ల మొక్కలు పంపిణీ చేయడానికి , విద్యాసంస్థలు ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటి వాటిని బ్రతికించడానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుందామని తెలిపారు. గుంటూరు నగరంలో రక్తం కొరతను నివారించడానికి స్వచ్ఛంద రక్తదాతల వివరాలను సేకరించి కంప్యూటరీకరణ చేసి స్వచ్ఛంద రక్తదానం ఉద్యమాన్ని బలోపేతం చేయాలని కోరారు.

మానవత చైర్మన్ పావులూరి రమేష్ ప్రసం గిస్తూ గత రెండు సంవత్సరాల కాలంలో గుంటూరు నగరంలో వృద్ధాశ్రమాలు , అనాథలు మరియు పిల్లల ఆశ్రమాలు మానసిక వికలాంగుల హాస్టల్ల లో భోజనం వితరణ కల్పించడం, శాంతి రథంతో పేదల అంత్యక్రియలకు తోడ్పడడం, ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమాలను చేపట్టా మని తెలిపారు. గుంటూరు నగరంలో 1000 మంది దాతృత్వం గల మానవతావాదులు మానవతా సంస్థలో సభ్యులుగా చేరి క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. పర్యావరణాన్ని కాపాడడానికి ప్లాస్టిక్ నిషేధం లో భాగంగా దాతల సహకారంతో జూట్ బ్యాగులు, క్లాత్ బ్యాగులు పంపిణీ కార్యక్ర మం చేపట్టామని తెలిపారు. వీధులలో వ్యాపారం చేసే చిరువర్తకులకు ఎండ నుండి రక్షణ కోసం గొడుగులు అందించటానికి నిర్ణయించామని, అవసరమైన చోట చలివేంద్రాలను చల్లటి నీటితో ఏర్పా టు చేయాలని మానవత నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో మానవత కన్వీనర్ వజ్రాల వెంకట నాగిరెడ్డి, డైరెక్టర్లు ఉప్పల సాంబశివ రావు , సిహెచ్ రామబ్రహ్మం , బి ఎన్ మిత్ర, నల్లమోతు సాంబ శివరావు, మానవత ట్రెజరర్ టీవీ సాయిరాం, . శివాజీ , లక్ష్మి సామ్రాజ్యం, పి.గురువారెడ్డి, వి.సదా శివరావు, టి తిరుపతి రెడ్డి, నెలపాల శ్రీనివాసరావు, తూమాటి ఉమామహేశ్వరరావు పద్మలత తదితరులు ప్రసంగించారు.

# ప్రతి జిల్లాలో ఎన్.సి.సి యూనిట్లను ఏర్పాటు చేస్తాం: వివిమ్ రెడ్డి



**గుంటూరు : మే 29( ఆంధ్రపత్రిక ):** తెలుగు రాష్ట్రాలలోని ప్రతి జాల్లాలో ఎన్.సి.సి యూనిట్లను ఏర్పాటుచేసి ఎన్.సి.సి ని అందరికి చేరువ చేస్తామని, ఎన్.సి.సి అందుబాటులో లేని ప్రాంతాలలో ఎన్.సి.సి అవశ్యకతను తెలియపరచి యూనిట్లను ఏర్పాటు చేస్తామని ఆంధ్ర, తెలంగాణా ఎన్.సి.సి డైరక్టరేట్ డిప్యూటీ డైరెక్టరేట్ జనరల్ ఎయిర్ కొమోడోర్ వివిమ్ రెడ్డి అన్నారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాలలో నిర్వహిస్తు 10ఏ బెటాలియన్ బాలికల వార్షిక శిక్షణ శిబిరం ను ఆయన సందర్శించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లడుతూ తెలుగు రాష్ట్రాలలో 70 యూనిట్ల ద్వారా శిబిరాలు నిర్వహిస్తున్నామని ఈ క్యాంపులలో ప్రతిభ కనబరిచిన కెడెట్లను డిల్లీలో నిర్వహించు తలసైనిక్ క్యాంప్ నకు ఎంపిక కాబడతారని తెలిపారు. ఈ సంవత్సరం నుండి వార్షిక శిక్షణ శిబిరంలలో సాహసవిన్యాసాలు రాక్ క్లైమింగ్, ట్రెక్కింగ్, కైయాకింగ్ కూడా ప్రవేశ పెట్టామని తద్వారా కెడెట్లు పూర్తిస్థాయి ప్రావిణ్యం పొందగలుగుతారని తెలిపారు. కేంద్రప్రభుత్వం మొదటిదశలో 26వేల ఎన్.సి.సి పోస్టుల భర్తీకి అనుమతి తెలిపిందని వివరించారు. ఈ శిబిరంలో ప్రతిభ కనబరచిన కెడెట్లకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమములో బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ ఎస్.వీ.ఎస్ సుదర్శన్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి మేజర్ అవినాష్ పట్వాల్, వివిఐటి ఎన్.సి.సి ఆఫీసర్ డా ఎ. శ్రీవాణి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## దేశ చరిత్రలో

# సీఎం జగన్ ప్రభుత్వం నిలుస్తుంది

**-ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు**



**విజయవాడ, మే29 (ఆంధ్రపత్రిక):** గత ఐదు సంవత్సరాల వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలు దిగ్విజయంగా అమలు చేశామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు ఆయన కార్యాలయం బుధవారం ప్రకటన విడుదల చేసింది. వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి నేటికి ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కుల మత ప్రాంతాలకు అతీతంగా, మధ్య వర్తుల ప్రేమాయం లేకుండా డిబిటి ద్వారా నేరుగా లక్షల కోట్ల రూపాయలను లబ్ధిదారుల ఖాతాలలో జమ చేశామన్నారు. పథకాలకు అర్హతలే ప్రామాణికంగా ఎటువంటి వివక్షకు తావు లేకుండా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పథకాలను అమలు చేసిందన్నారు. వాలంటీర్ల వ్యవస్థ ద్వారా సామాన్యులకు సైతం ప్రభుత్వ పథకాలు నేరుగా ఇంటికే అందించామన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఏ చిన్న పని కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ సామాన్యులు ప్రదిక్షణాలు చేయవలసిన అగత్యం ఉండేదని, వాలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రభుత్వ అధికారులే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారికి కావాల్సిన పనులు పూర్తయ్యేలా సిఎం జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రతి పేద కుటుంబానికి ఏదో ఒక పథక మైనా అందేలా తమ పరిపాలన సాగిందన్నారు. దేశ చరిత్రలో.. ఒకేసారి రికార్డ్ స్థాయిలో ఒకటి పాయింట్ 34 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్ జగన్ ప్రభుత్వ మేనని, ఆంధ్రప్రదేశ్ సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజుల్లోనే ఒకేసారి రాష్ట్రంలో 2,06,638 పర్మినెంట్ ప్రభుత్వ ఉద్యోగాలు, 37,908 కాంట్రాక్టు ఉద్యోగాలు, 3,71,777 ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను మంజూరు చేశారని గుర్తు చేశారు. వాటి భర్తీకి చర్యలు చేపట్టి కేవలం నాలుగు నెలలునే నియమకాలు పూర్తి చేసి రికార్డు సృష్టించారన్నారు. ప్రస్తుతం అమలవుతున్న పథకాలు కొనసాగి..పెద్దవాళ్ళకి అభివృద్ధి జరగాలంటే తిరిగి మరోసారి సీఎం జగన్ మోహన్ రెడ్డి పాలన రావాలన్నారు. ప్రజలు ఇప్పటికే వైఎస్ఆర్సీపీ అనుకూలంగా తీర్పు ఇచ్చారని, జూన్ 4వ తేదీన దాని ఫలితాలు వస్తాయన్నారు. జూన్ 9న వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రిగా విశాఖలో ప్రమాణస్వీకారం చేస్తారని ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్ తెలిపారు.

## వైభవంగా ముగిసిన శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి

# వసంతోత్సవాలు



**తిరుమల, మే29 (ఆంధ్రపత్రిక):** శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన వసంతోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. ఉదయం 8.30 నుండి 9.30 గంటల వరకు శ్రీ భూ సమేత వేంకటేశ్వరస్వామి, శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి, రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుని ఉత్సవమూర్తులను వసంత మండపంలోకి వేంచేపు చేసి ఆస్థానం నిర్వహించారు. మధ్యాహ్నం 1.45 నుండి 3.30 గంటల వరకు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వైభవంగా జరిగింది. ఇందులో ముందుగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రాజోపచారం నిర్వహించారు. అనంతరం ఛత్ర ఛామర వ్యజన దర్పణాది నైవేద్యం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం చేపట్టారు. అర్ఘ్యపాద్య నివేదనలో భాగంగా క్షీర(పాలు), దధి(పెరుగు), మది(తేనె), నారికేళం(కొబ్బరినీళ్లు), హరిద్రోదకం(పసుపు), గంధోధకం(గంధం)తో స్నపనం నిర్వహించారు. వీటిని చక్రధార, శంఖధార, సహస్రధార, మహాకలశాభిషేకాలను వైఖనస ఆగమయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలసూక్తం, విష్ణుసూక్తం, దశ శాంతి మంత్రములు, తైత్తరీయ ఉపనిషత్తు, దివ్య ప్రభందములో అభిషేక సమయంలో అనుసంధానము చేసే నిరాట్టమ పాశురాలను అర్చకులు పఠించారు. ఈ వేడుకలో ఒకో క్రతువులో ఒక మాల వంతున మొత్తం ఏడు రకాల మాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. ఇందులో కురువేరు(వట్టివేరులో ఒకరకం), వట్టివేరు, రోజా, మల్లె, సంపంగి, గులాబి, దవణం, తులసి మాలలు స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. కాగా సాయంత్రం 6 నుండి 7 గంటల వరకు ఊంజల్ సేవ, రాత్రి 7 నుండి 8 గంటల వరకు స్వామి, అమ్మవార్లు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఇఓ వరలక్ష్మీ, ఏఇఓ గోపినాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, టెంపుల్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## రక్తపోటు అవగాహన మాసాన్ని

# ముగించిన గ్లెన్ మార్క్ ఫార్మా




**విజయవాడ, మే29 (ఆంధ్రపత్రిక):** పరిశోధన ఆధారిత గ్లోబల్ ఫార్మాస్యూటికల్ కంపెనీ అయిన గ్లెన్ మార్క్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ (గ్లెన్ మార్క్) మే నెలను రక్తపోటు అవగాహన మాసంగా గుర్తించింది. గ్లెన్ మార్క్ దేశవ్యాప్తంగా 250కి పైగా నగరాలు, పట్టణాల నుంచి 1000 మందికి పైగా వైద్య నిపుణులతో (హెల్త్ కేర్ ప్రొఫెషనల్-హెచ్‌సీపీ) భాగస్వామ్యం కుదుర్చుకుంది. రక్తపోటు గురించి సామూహిక అవగాహన కల్పించడానికి 400కు పైగా ప్రజా అవగాహన ర్యాలీలు, పరీక్ష శిబిరాలను నిర్వహించింది.ర్యాలీలలో హెచ్‌సీపీల నేతృత్వంలో సాధారణ సమాచార సెషన్లు ఉన్నాయి. ఇవి రక్తపోటుకు సంబంధించిన సంకేతాలు, లక్షణాలు, నివారణ చర్యలపై లోతైన సమాచారాన్ని అందించాయి. తదనంతరం, సాధారణ ప్రజలకు వారి రక్తపోటు స్థాయిలను అంచనా వేసే అవకాశాన్ని కల్పించడానికి రక్తపోటు పరీక్ష శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ చొరవ ఫలితంగా, గ్లెన్ మార్క్ విజయవంతంగా 60 లక్షల మంది పెద్దలను కలిసి, వారికి వ్యాధి గురించి సమర్థవంతం గా అవగాహన పెంచింది. ఈ కార్యక్రమం గురించి గ్లెన్ మార్క్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ ప్రెసిడెంట్, హెడ్ ఆఫ్ ఇండియా ఫార్ములేషన్స్ శ్రీ అలోక్ మాలిక్ మాట్లాడుతూ, "భారతదేశంలో అధిక రక్తపోటుపై పోరాటంలో అవగాహన కల్పించడానికి, అర్థవంతమైన ప్రభావాన్ని చూపడానికి గ్లెన్ మార్క్ సంస్థలో మేమంతా గట్టిగా కట్టుబడి ఉన్నాము. వ్యాప్తి పెరుగుతున్నందున, 18 ఏళ్లు పైబడిన యువకులతో సహా భారతీయ జనాభాలో ఈ సైలెంట్ కిల్లర్ గురించి అవగాహన పెంచడానికి మేము ప్రాధాన్యం ఇవ్వడం చాలా ముఖ్యం. అధిక రక్తపోటు భవిష్యత్తులో కార్డియో-వాస్కులర్ ప్రమాదాలను కలిగిస్తుంది కాబట్టి, మా కార్యక్రమాల ద్వారా రక్తపోటును ముందుగానే గుర్తించుకుని, తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అవగాహన పెంచడాన్ని మేము లక్ష్యంగా పెట్టుకున్నాము. ఈ సమస్యతో ప్రభావితమైన లక్షలాది మంది ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో మేము గణనీయమైన ప్రభావం చూపించగలం" అని తెలిపారు. భారతీయులకు రక్తపోటుపై అవగాహన పెంచడంలో, రోగ నిర్ధారణను ప్రోత్సహించడంలో గ్లెన్ మార్క్ ముందంజలో ఉంది. 18 ఏళ్లు పైబడిన భారతీయులకు రక్తపోటు అవగాహన, పరీక్షల సంఖ్యను పెంచడానికి కంపెనీ 18 అనే ప్రచారాన్ని ప్రారంభించింది. గ్లెన్ మార్క్ ఇప్పటికే తన డిజిటల్ ప్లాట్ఫామ్: సహా అనేక ఛానళ్లు, ప్రసార మాధ్యమాల ద్వారా లక్షలాది మంది భారతీయ ప్రజలకు చేరువైంది. 2020 లో, గ్లెన్ మార్క్ హెచ్ఎస్ఐ (హైపర్టెన్షన్ సొసైటీ ఆఫ్ ఇండియా) మరియు ఏపీఐ (అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా) సహకారంతో ప్రపంచంలోనే మొట్టమొదటి హైపర్‌టెన్షన్ అవగాహన చిహ్నం - "ది బిపి లోగో" ను ప్రారంభించింది.

## మార్చిలో నిర్వహించిన

# కేంబ్రిడ్జ్ పరీక్ష ఫలితాల విడుదల

**విజయవాడ,మే29(ఆంధ్రపత్రిక):** కేంబ్రిడ్జ్ యూనివర్శిటీ ప్రెస్ అండ్ అసెస్మెంట్ లోని ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ గ్రూప్ భారతదేశంలో మార్చి పరీక్షా సిరీస్ ఫలితాలను ఇటీవల ప్రకటించింది. దేశవ్యాప్తంగా 400 విద్యాసంస్థల నుంచి 15 వేల కన్నా ఎక్కువ మంది విద్యార్థులు కేంబ్రిడ్జ్ ఐజీసీఎస్ఈ, ఇంటర్నేషనల్ ఏఎస్ అండ్ ఎ లెవెల్ ఫలితాలను పొందగా, ఇది భారతదేశంలో కేంబ్రిడ్జ్ నిర్వహించిన అతిపెద్ద మార్చి సిరీస్‌గా నిలిచింది. మార్చి పరీక్షల శ్రేణికి 76 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. గత ఏడాదితో పోల్చితే ఇది 17 శాతం వృద్ధి చెందింది. కేంబ్రిడ్జ్ ఐజీసీఎస్ఈ 56 వేలకు పైగా దరఖాస్తులను అందుకోగా, ఇది గత ఏడాదితో పోల్చితే 17 శాతం పెరిగింది. కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ ఏఎస్ అండ్ ఎ లెవెల్ 18,400 కన్నా ఎక్కువ దరఖాస్తులను అందుకోగా, గత ఏడాదితో పోల్చితే 18 శాతం పెరిగింది.

## మీకు మరియు మీ కుటుంబానికి

# సమగ్ర ఆల్-రౌండ్ రక్షణ

**రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ రిలయన్స్ పర్సనల్ యాక్సిడెంట్ 360షీల్డ్‌ను ప్రవేశపెట్టింది**

**విజయవాడ, మే29 (ఆంధ్రపత్రిక):** ప్రముఖ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలలో ఒకటైన రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ ఇప్పుడు తన తాజా ఉత్పత్తి, వ్యక్తులు మరియు కుటుంబాలకు అసమానమైన రక్షణను అందించుటకు రూపొందించబడిన ఒక వ్యక్తిగత యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పాలసీ, రిలయన్స్ పర్సనల్ యాక్సిడెంట్ 360షీల్డ్ ను ప్రకటించుటకు గర్విస్తోంది. ఈ ప్రత్యేక రక్షణ కవర్ మిమ్మల్ని మరియు మీ ప్రియమైన వారిని కేవలం వ్యక్తిగత ప్రమాదాల ప్రభావము నుండే కాకుండా, ఒక ప్రమాదము యొక్క అనంతర షాక్ గా ఉత్పన్నము అయ్యే ప్రభావము నుండి కూడా రక్షిస్తుంది. ఈ పాలసీ భారతదేశము ప్రపంచవ్యాప్తంగా, ప్రభావము యొక్క అన్ని గణనీయంగా అంశాలలో 360-డిగ్రీల రక్షణను అందించుట లక్ష్యంగా రూపొందించబడింది. ఈ ప్రత్యేక పాలసీ సంప్రదాయిక ప్రమాదవశాత్తు కలిగే వైకల్యము లేదా డెత్ కవరేజ్, అనంతర ప్రమాణాలు మరియు సంబంధిత ఖర్చులను ప్రస్తావించడం కంటే ఎక్కువగా అందిస్తుంది. ప్రమాదాలు అనేవి క్షణాలలో జీవితాలను తలక్రిందులు చేయగలవు, అవి కేవలం శారీరిక హాని చేయడమే కాకుండా గణనీయమైన ఆర్థిక ఒత్తిడి కూడా కలిగిస్తాయి. హాస్పిటలైజేషన్ ఖర్చుల నుండి అవుట్-పేషెంట్ ఖర్చుల వరకు, ఇల్లు, వాహనము విద్యా ఋణము వంటి వ్యక్తిగత ఆర్థిక బాధ్యతల నుండి న్యాయ సహాయము కొరకు ఏర్పాటు చేసుకోవడం వరకు మరెన్నో కవర్ చేయడము వరకు ఈ పాలసీ ఇన్సూర్డ్ వారి కుటుంబానికి అవసర సమయములో సంపూర్ణ సహకారాన్ని అందిస్తుంది. వివిధ ప్రమాద-సంబంధిత ఆకస్మిత పరిస్థితులకు ఆల్-ఇన్-వన్ కవరేజ్ ఉండేలాగా ఈ సమగ్రమైన పాలసీ నిర్ధారిస్తుంది. అదనంగా, ఇందులో విస్తృతమైన రక్షణను అందించుటకు ప్రయోజనాలను మరియు నష్టపరిహార లక్షణాలను కలిసి ఉంటాయి. ఈ ఉత్పత్తి ప్రారంభం గురించి మాట్లాడుతూ, రాకేష్ జైన్, సీఈఓ, రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్, ఇలా పేర్కొంటూ తన అభిప్రాయాలను వ్యక్తపరచారు,"తోటి భారత పౌరులు మరియు వారి కుటుంబాలు అనుకోని సంఘటనల నుండి రక్షించబడ్డారని నిర్ధారించడానికి మేము కట్టుబడి ఉన్నాము. ఆవశ్యక కవరేజెస్ మాత్రమే కాకుండా, అత్యవసర సమయాలలో సమగ్ర సహకారము కూడా అందించడము కొరకు రిలయన్స్ పర్సనల్ యాక్సిడెంట్ 360షీల్డ్ రూపొందించబడింది. ధృఢమైన ఋణము మరియు ఈఎంఐ రక్షణతో ఈ ప్లాన్ ఆర్థిక భారము నుండి ఉపశమనం కలిగిస్తుంది, తద్వారా ప్రభావిత కుటుంబాలు ఆర్థిక ఒత్తిడికి లోనవ్వకుండా తమ సంక్షేమము పై దృష్టి కేంద్రీకరించుటకు అనుమతిస్తుంది. అదనంగా, ఈ పాలసీ ప్రపంచ వ్యాప్త ప్రయాణ సంరక్షణను అందిస్తుంది మరియు వ్యక్తిగత ప్రమాదాలకు ప్రపంచవ్యాప్త కవరేజ్ ను నిర్ధారిస్తుంది. ట్రామా కౌన్సెలింగ్, పునర్నిర్మాణాత్మక శస్త్రచికిత్స మరియు ప్రత్యేక పరిస్థితుల కొరకు పెరిగిన కవరేజ్?ల వంటి వాటిని ఏకీకృతం చేయడం ద్వారా, మేము 360-డిగ్రీల షీల్డ్ గా ఉండే వాగ్దానాన్ని నిలబెట్టుకునే ఒక పాలసీని రూపొందించాము." ఈ ప్లాన్ అడ్వెంచర్ స్పోర్ట్స్ కవరేజ్, మొత్తం మరియు పాక్షిక వైకల్య ప్రయోజనాలు మరియు ప్రమాద సంబంధ హాస్పిటలైజేషన్ పరిమితి యొక్క అపరిమిత పునఃస్థాపన వంటి విలువైన యాడ్-ఆన్స్ అందించడం ద్వారా 360-డిగ్రీల షీల్డ్ ను అందించే వాగ్దానాన్ని నిలబెట్టుకుంటుంది. కోమా, గర్భస్రావము మరియు ఎయిర్ అంబులెన్స్ సర్వీసెస్ లతో సహా ప్రత్యేక పరిస్థితుల కొరకు పెరిగిన కవర్స్, సమగ్ర సంరక్షణకు మా నిబద్ధతను మరింత పెంచుతుంది. రూ. 5 లక్షల నుండి రూ. 25 కోట్ల వరకు ఉండే కవరేజ్ ఎంపికలతో, ఎవరైనా తమ అవసరాల కొరకు ఖచ్చితంగా సరిపోయేదానిని ఎంచుకోవచ్చు. అదనంగా,ఈ ప్లాన్ ట్రామా కౌన్సెలింగ్ కొరకు (రూ. 10,000 ప్రతి సెషన్ కు) మరియు పునర్నిర్మాణాత్మక శస్త్రచికిత్స (రూ. 10 లక్షల వరకు) కవరేజ్ ను అందిస్తుంది, తద్వారా ఈ పాలసీ కింద పాలసీదారులు నిజంగా రక్షించబడతారు అని నిర్ధారిస్తుంది. అంతేకాకుండా, ఒక వ్యక్తిగత యక్సిడెంట్ పాలసీని నిర్వహించడం ఆరోగ్య బీమాపై మీ నో-క్లెయిమ్ బోనస్ ను నిలిపి ఉంచుకొనుటలో సహాయపడుతుంది.

# తక్కువ ప్రీమియంతో ఎక్కువ బీమా



**విజయవాడ, మే29 (ఆంధ్రపత్రిక):** తక్కువ ప్రీమియంతో ఎక్కువ బీమా సదుపాయాన్ని తపాలా శాఖ , టాటా గ్రూప్ సౌజన్యం తో ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చిందని విజయవాడ తపాలా శాఖ అధికారి సీనియర్ సూపరిండెంట్ శ్రీ నరసింహ స్వామి తెలిపారు. 520 రూపాయలతో ప్రమాద బీమా చేసుకుని ప్రమాద వశాత్తూ మరణించిన స్థానిక గురజాడ గ్రామ నివాస కుటుంబానికి తపాలా శాఖ అధికారులు 10 లక్షల చెక్కును అందచేశారు.అంతే కాకుండా 755 రూపాయలతో ప్రమాద బీమా చేసుకుంటే 15 లక్షల ఇన్స్యూరెన్స్, 1 లక్ష హాస్పిటల్ ఖర్చులు, సంవత్సరానికి ఒకసారి ఉచిత హెల్త్ చెకప్, ఉచిత డాక్టర్ టెలి కన్సల్టేషన్ వంటి సదుపాయాలు ఉన్నాయని తెలిపారు.ఈ ప్రమాద పాలసీ ప్రతీ పోస్టు ఆఫీసు లో అందుబాటులో ఉందని ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విజయవాడ తపాలా శాఖ అధికారి సీనియర్ సూపరిండెంట్ శ్రీ నరసింహ స్వామి, బ్యాంకు అధికారులు ఎస్.సుబ్బారావు, కె. అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమాల చక్రం తిప్పుతున్న

# ఈ.ఓ.పై స్వత్వరమే చర్యలు తీసుకోండి



**మోపిదేవి, మే29 (ఆంధ్రపత్రిక):** సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ లిదేవస్థానం కార్య నిర్వహణాధికారి (ఉప కమీషనర్) నల్లం సూర్యచక్రధరరావు పై చర్యలు కోరుతూ మరోసారి దేవాదాయ శాఖ రాష్ట్ర దేవాదాయశాఖ ముఖ్యఅధికారి ఆర్.కరికాల్ వళవన్‌ను కలిసి ఫిర్యాదు చేసిన శ్రీనివాస్ గౌడ్ ఈ వ్యవహారంలో విచారణాధికారిగా ఎండోమెంట్ జాయింట్ కమీషనర్ చంద్రశేఖర్ ఆజాద్ ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ఉన్నధికారులు కృష్ణాజిల్లా, మోపిదేవి గ్రామంలోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వ రస్వామివారి దేవస్థానం పూజా ద్రవ్యములు విక్రయం (షాపు నెం.1) సీల్ టెండరు -కం-బహిరంగ వేలంలో తమకు వచ్చిన షాప్ ను నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి వేరేవారికి దుకాణంను కేటాయించి అక్రమానికి పాల్పడి తమకు అన్యాయం చేసిన కార్యనిర్వహణాధికారి (ఉప కమీషనర్) నల్లం సూర్యచక్రధరరావు పై చర్యలు కోరుతూ తమ పక్షాన ఫిర్యాదు తో న్యాయం జరిగేలా చేయూత ఇవ్వాలని పబ్బా ధనలక్ష్మి సామాజిక కార్యకర్త, సహా.చట్టం కార్యకర్త జంపాన శ్రీనివాస్ గౌడ్ ను ఆశ్రయించారు.ఈ అంశంపై భాధితుల పక్షాన శ్రీనివాస్ గౌడ్ పబ్బా ధనలక్ష్మి కి జరిగిన అన్యాయం పై రాష్ట్ర లోకాయుక్త కు ఫిర్యాదు చేసిన శ్రీనివాస్ గౌడ్ ఇటివల అమరావతిలోని సెక్రటేరియట్ లో రాష్ట్ర దేవాదాయశాఖ ముఖ్యఅధికారి ఆర్.కరికాల్ వళవన్ ను ఆయన ఛాంబర్‌లో కలిసిన మోపిదేవి ఆలయంలోని ఎండోమెంట్ అధికారిపై ఫిర్యాదు పత్రాన్ని స్వయం గా అందజేశారు.ఇదే అంశం ఆయన గొల్లపూడి లోని ఎండోమెంట్ స్టేట్ కార్యాలయంలో దేవాదాయ శాఖ కమీషనర్ ఎస్.సత్య నారాయణను కూడా కలిసి సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.ఈ అంశంపై సమగ్ర విచారణ చేసి తగిన చర్యలు తీసుకుని భాధితులకు న్యాయం చేయాలని శ్రీనివాస్ గౌడ్ కోరారు.ఈ ఫిర్యాదు పై తాజా పరిస్థితి ని తెలుసుకునేందుకు ఎండోమెంట్ రాష్ట్ర కార్యాలయాన్ని సందర్శించిన జంపాన శ్రీనివాస్ గౌడ్ మరోసారి మోపిదేవి దేవస్థానం అధికారి తీరుపై రాష్ట్ర దేవాదాయశాఖ ముఖ్య అధికారి ఆర్.కరికాల్ వళవన్ కు ఫిర్యాదు చేశారు.

**ఫిర్యాదు పై అధికారుల స్పందన :** రాష్ట్రంలో ప్రముఖ దేవాలయాలలో ఒకటిగా ఎండోమెంట్ శాఖ పరిధిలో ఉన్న మోపిదేవి శ్రీ సుబ్రమణ్య స్వామి వారి దేవస్థానంలో కార్యనిర్వహణాధికారి వ్యవహారంలో ఆరోపణలు పై రాష్ట్ర దేవాదాయశాఖ ముఖ్య అధికారి ఆర్.కరికాల్ వళవన్ తక్షణ విచారణకు ఆదేశించారని జంపాన శ్రీనివాస్ గౌడ్ కు సమాచారం తెలిసింది. ఈ మేరకు సూర్యచక్రధరరావు వవహారంలో సెక్రటేరియట్ లోని సి.ఎస్. పేషి నుండి ఎండోమెంట్ కమీషనర్ ఆఫీసుకు ఆదేశాలు అందటంతో దేవాదాయ శాఖ కమీషనర్ ఎస్.సత్యనారాయణ దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ఎండోమెంట్ జాయింట్ కమీషనర్ చంద్రశేఖర్ ఆజాద్ ను విచారణాధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.మోపిదేవి గ్రామంలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం నల్లం సూర్యచక్రధరరావు పై వచ్చిన ఆరోపణల పై విచారణ చేపట్టారు.మరికొన్ని రోజులలో విచారణ పూర్తిచేసి గౌరవ లోకాయుక్త కు నివేదిక అందజేయనున్నట్టు తెలిసింది.

## అందుబాటులోకి స్పార్క్స్

# సమ్మర్ స్టైలిష్ 2024 కలెక్షన్




**విజయవాడ,మే29(ఆంధ్రపత్రిక):** నేటి యువత ఎప్పటికప్పు తమ అభిరుచుల్ని మార్చుకుంటుందని, దీనికి అనుగుణంగా స్పార్క్స్ సమ్మర్ స్టైలిష్ 2024 కలెక్షన్ ను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు రిలాక్సో ఫుట్‌వేర్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గౌరవ్ దువా తెలిపారు. స్పార్క్స్ తాజా వేసవి కోసం చాలా కంఫర్ట్ స్టైల్ తో కూడిన స్ప్రింగ్ సమ్మర్ కలెక్షన్ 2024ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సరికొత్త ఉత్పత్తులు స్టైలిష్ డిజైన్‌ను అందిస్తాయని, అదే సమయంలో ఫ్యాషన్‌గా ఉంటాయన్నారు. "స్టైలిష్‌తో సౌకర్యవంతమైన చెప్పుల డిమాండ్‌ను తీర్చడానికి రూపొందిం చిన మా కొత్త స్ప్రింగ్ సమ్మర్ కలెక్షన్ ను తీసుకువచ్చామన్నారు. స్వెట్ వికింగ్ ఫ్యాబ్రిక్‌లతో తయారు చేసిన తేలికపాటి చెప్పులను అందిస్తున్నామని, వీటిని మన కాలికి తగ్గట్లుగా అడ్జెస్ట్ కూడా చేసుకోవచ్చునన్నా రు. ఈ కొత్త చెప్పులు రోజువారీ కార్యకలాపాల కోసం ఉపయోగించుకోవచ్చునని, స్త్రీ, పురుష సంబంధం లేకుండా ప్రతీ ఒక్కరూ ఉపయోగించవచ్చునన్నారు. ఇది అల్ట్రా-కంఫర్టబుల్ ట్రెండీ స్లిప్పర్‌ల శ్రేణిని కూడా అందిస్తుందని, స్పార్క్స్ ఇట్స్ ఇన్ మీ అనే పేరుతో డిజిటల్ క్యాంపెయిన్ కూడా ప్రారంభించినట్టు చెప్పారు. స్పార్క్స్ కొత్త స్ప్రింగ్ సమ్మర్ కలెక్షన్ దేశంలోని ప్రధాన రిటైల్ అవుట్ లెట్ లలో అందుబాటులో ఉంటాయని, 405 ప్రత్యేక బ్రాండ్ అవుట్‌లెట్‌లు (ఈ బి ఓలు) ప్రముఖ పాదరక్షల దుకాణాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## శ్రీ సువర్చలాంజనేయ స్వామి వారి దేవస్థానము నందు

# సుందరాకాండ హవనము



**కృత్తివెన్ను, మే29 (ఆంధ్రపత్రిక):** కృత్తివెన్ను మండలం పాశ్చాపురము గ్రామమునందు వేంచేసి ఉన్న సువర్చలాంజనేయ స్వామి వారి దేవస్థానము నందు హనుమత్ జయంతిని పురస్కరించుకొని గత 43 రోజులుగా హనుమాన్ చాలీసా పారాయణం చేస్తూ బుధ గురు వారముల నందు హావనము (హెూమము) అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్ర మంలో భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం సాయంత్రం ఏడు గంటలకు శ్రీ నట రాజేశ్వరి కళానికేతన్ బంటుమిల్లి వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను అలరించింది. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమాలన్నీ శ్రీ సువర్చలాంజనేయ స్వామి దేవస్థానం అర్చక స్వాముల వారి ఆధ్వర్యంలో జరిగినది.

## ఘనంగా

# చిన్నకొండామర్రిలో గంగ జాతర



**చౌడేపల్లి,మే29 (ఆంధ్రపత్రిక):** చౌడేపల్లి పరిధిలోని చిన్న కొండా మర్రి లో బుధవారం ఘనంగా గంగ జాతరను నిర్వహించారు. రెండు రోజులపాటు జరిగిన జాతరలో పలు కార్యక్రమాలు జరిగాయి. మంగళ వారం రాత్రి అమ్మవారి ఊరేగింపు తమిళనాడు, కర్ణాటక నుంచి వివిధ కళాకారులు తరలివచ్చి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ జాతరకు హైలెట్గా వారి నృత్యాలు నిలబడ్డాయి. తెల్లవారు జామున మహిళలచే దీపారాధన, విశేష దర్శనము జరిగాయి. ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గంగ జాతరను గ్రామస్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. జాతరను దృష్టిలో ఉంచుకొని గ్రామంలో ప్రతి వీధిలోను మిరిమిట్లు గొలిపే విద్యుత్ దీపాలంకరణ, రంగురంగుల, పూలతో దివ్యాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవారిని చూసేందుకు ఈ ప్రాంతం నుంచే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గ్రామస్తులు అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

# కూటమిదే విజయం

(మొదటిపేజీ తరువాయి)

ఎంపీ రామ్మోహన్ నాయుడు అన్నారు. టిడిపి వచ్చిన తరవాతనే బడు గు,బలహీన వర్గాలకు రాజకీయ అవకాశాలు దక్కాయన్నారు. మీడియాతో మాట్లాడుతూ జగన్‌పై ప్రజలకు మోజు తగ్గిందని, ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత ఓట్ల రూపంలో నమోదు అయ్యిందని అన్నారు. ప్రజలు టీడీపీ వైపు చూస్తున్నారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. నవరత్నాలు సైతం సరిగ్గా అమలు చేయలేదని విమర్శించారు. సకాలంలో పెన్షన్లు సక్రమంగా అందిం చలేదని అన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో టిడిపి కూటమి ఘన విజయం సాధించబోతోందని అన్నారు. పేదవాడు దౌర్భాగ్య పరిస్థితి అనుభవిస్తున్నాడని తెలిపారు. గ్రామ సచివాలయాలు సక్రమంగా పనిచేయలేదని, ప్రజలు తమ సమస్యలపై టీడీపీని ఆశ్రయిస్తున్నట్లు చెప్పారు. హోదాపై ఐదేల్లుగా జగన్ ఎందుకు మాట్లాడలేకయారని నిలదీశారు. జగన్ పులకేసి రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. జగన్ సర్కార్ అరాచక పాలనతో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు నాశనమయ్యాయని ఎంపి అన్నారు. వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్లామని అన్నారు. సార్వ త్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి సీఎంగా చంద్రబాబును చేసేందుకు కార్యకర్తలు, నేతలు సైనికుల్లా పనిచేశారని అన్నారు. వైసీపీ ప్రభుత్వానిది నిరంకుశ పాలన అని టీడీపీ నేత విమర్శించారు. ప్రభుత్వ తప్పులను ప్రశ్నించే వారిని బెదిరించడం, కేసులు పెట్టి వేధించడం జగన్ పాలనలో పరిపాటిగా మారిందన్నారు. వైసీపీ పాలనపై అన్నివర్గాల ప్రజలు విసిగి వేసారిపోయారన్నారు. కౌంటింగ్‌కు కూడా భారీగా భద్రత ఏర్పాటుచేయాల్సిన దుస్థితిని తీసుకుని వచ్చారని అన్నారు. టీడీపీ పథకాలకు పేర్లు మార్చి కొందరికి మాత్రమే ఇస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని తేలిందని అన్నారు. విద్యుత్ కోతలతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రామ్మోహన్ నాయుడు అన్నారు.

# వైసిపి ఏజెంట్లకు సజ్జల హెచ్చరికలు

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శి సజ్జల రామకష్ణారెడ్డి సూచించారు.కౌంటింగ్ జరిగేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలి.. అవతల పార్టీ వాళ్ళ ఆటలు సాగనివ్వకుండా జాగ్రత్తగా ఉండాలి అని పిలుపునిచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో కౌంటింగ్ ఏజెంట్లకు పార్టీ ముఖ్య నేతలు దిశానిర్దేశం చేశారు. కౌంటింగ్ ఏజెంట్ల సమావేశానికి ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. ఖచ్చితంగా మళ్ళీ అధికారంలోకి వస్తున్నాం.. జూన్ 9వ తేదీన ప్రమాణస్వీకారం ఉంటుంది అందులో ఎలాంటి అనుమానం లేదు అని సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. అలాగే, ఫలితాల ముందు తాత్కాలిక ఆనందాలకు తాము వెళ్లడం లేదని సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. ఇక, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు తమకే పడ్డాయని.. టీడీపీ నేతలు ప్రచారం చేసుకుంటున్నారంటూ మండిపడ్డారు. వారంరోజుల తర్వాత రాష్ట్రానికి టీడీపీ పీడ విరగడ వుతుందని పేర్కొన్నారు. అయితే, బీజేపీతో చంద్రబాబు పొత్తు తర్వాత ఆయనకు అనుకూలంగా ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తుందని ఆరోపణలు గుప్పించారు. ఈసీ చంద్రబాబు వైరస్‌తో ఇన్ఫెక్ట్ అయిందంటూ సజ్జల మండిపడ్డారు. ఏపీలో ఎన్నికల కమిషన్ రూల్స్ ప్రకారం కౌంటింగ్ సమయంలో వైఎస్సార్‌సీపీ పోలింగ్ ఏజెంట్లు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ప్రత్యర్థి పార్టీ ఏజెంట్లతో అప్రమత్తంగా వ్యవహరించాలి. అవతలి పార్టీల ఆటలు సాగనివ్వద్దు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే కచ్చితంగా మళ్లీ అధికారంలోకి వస్తుంది. జూన్ తొమ్మిదో తేదీన ప్రమాణ స్వీకారం ఉంటుంది. అందులో ఎలాంటి అనుమానం లేదు' అని వ్యాఖ్యలు చేశారు.

# కేరళలోకి నైరుతి ఆగమనం..

(మొదటిపేజీ తరువాయి)

భారత వాతావరణ శాఖ చల్లటి వార్త చెప్పింది. మరికొద్దిగంటల్లోనే నైరుతి రుతుపవనాలు కేరళను తాకనున్నాయని వెల్లడించింది. అంచనా వేసిన సమయానికంటే ముందే నైరుతి వస్తుం డటంతో ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తు న్నారు. కేరళను నైరుతి తాకిన నాలుగైదు రోజుల్లోనే ఏపీ, తెలంగాణకు కూడా విస్తరిస్తాయని వాతావరణ నిపుణులు వెల్లడించారు. నైరుతి రాకతో అగ్నిగోళంలా మండుతున్న రాష్ట్రాలు చల్లబడనున్నాయి. నైరుతి రుతుపవన కాలంలో వర్షాలు దంచికొట్టనున్నాయని పేర్కొన్నారు. గతేడాది రుతుపవనాలు అంచనా వేసిన సమ యానికంటే ఆలస్యంగా వచ్చాయని, ఇప్పుడు మాత్రం రుతుపవనాల వ్యాప్తికి వాతావరణం అనుకూలంగా ఉందని చెప్పారు. కాగా.. ఉపరితల ద్రోణి, అల్పపీ డనం ప్రభావంతో వారంరోజులుగా అక్కడక్కడా అడపాదడపా పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఇప్పుడు అంచనా వేసిన సమయానికి రుతుపవనాలు తీరాన్ని తాకి వర్షాలు పడితే.. వ్యవసాయ పనులను కూడా ప్రారంభించవచ్చని రైతన్నలు ఎదురుచూస్తున్నారు.

# ఢిల్లీకి తాగునీటి కష్టాలు

(మొదటిపేజీ తరువాయి)

నమోదవుతున్నాయి. తాజాగా బుధవారం అత్యంత స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోద య్యాయి. ఏకంగా 52.3 డిగ్రీల సెల్సియస్ నమోదైనట్లు వాతా వరణ శాఖ తెలిపింది. దీంతో ఢిల్లీ అగ్నిగుండలా మారింది. బయ టకు రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. ఇదొక పెద్ద సమస్యగా ఉంటే.. తాజాగా మరో కొత్త సమస్య హస్తినను వెంటాడుతోంది. తాగునీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొన్నటి దాకా బెంగళూరు నీటి సమస్యతో చాలా ఇక్కట్లు పడింది. ఇప్పుడు ఢిల్లీ వంతు వచ్చింది. ప్రజలు కనీస అవసరాలకు నీళ్లు లభించక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఎవరైనా నీటిని వృథా చేస్తే రూ.2000 జరిమానా విధించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కొద్ది రోజులుగా నీటికొరత వేధిస్తుండటంతో ప్రభుత్వం ఈ చర్యలకు ఉపక్రమించింది.నీటి పైపులతో కార్లను కడగడం, వాటర్ ట్యాంకర్లు ఓవర్ ఫ్లో కావడం, వాడుక నీటిని నిర్మాణ, వాణిజ్యపరమైన అవసరాల కోసం వినియోగించడం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు మంత్రి అతిషి ఆదేశించారు. ఇందుకోసం ఢిల్లీ వ్యాప్తంగా 200 బృందాలను తక్షణమే ఏర్పాటు చేయాలని సూచించారు. ఎవరైనా నీటిని వృథా చేస్తే రూ.2000 జరిమానా విధించనున్నట్లు మంత్రి అతిశీ తెలిపారు.

# మోదీ పాలనలో ఉపాధి కరువు..!

(మొదటిపేజీ తరువాయి)

జరిగిన బహిరంగ సభలో పాల్గొన్న ఆమె ప్రసంగించారు. విపక్ష ఇండియా కూటమి అధికారంలోకి రాగానే చిన్న తరహా పరిశ్రమలను పోత్సహిస్తామని తెలిపారు. చిన్న తరహా పరిశ్రమల రంగంలో ఉద్యోగాలను కల్పిస్తామని అన్నారు. ప్రధాని మోదీ తన పాలనలో ఉపాధి కల్పనను పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. బీజేపీ విధానాలను మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బీజేపీ విధానాలకు చిన్న పరిశ్రమలు చితికిపోయేలా ఉన్నాయని తెలిపారు. కాషాయ పాలకుల విధానాలతో చిన్న పరిశ్రమలు చిన్నాభిన్నం అవుతుంటే..మరో వైపు బిలియనీర్లు సంపద పోగేసుకుంటున్నారని దుయ్య బట్టారు. చిన్న, మధ్యతరగతి వ్యాపారాలను బలోపేతం చేయాలని అన్నారు. చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తే వాటి ద్వారా చాలా మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. కోటీశ్వరులను బలోపేతం చేయడమమే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తుందని విమర్శించారు. దేశంలోని సంపద అంతా బిలియనీర్లకు నెమ్మదిగా అందజేస్తున్నారని ఆరోపించారు.మోదీ పాలనలో ఉపాధి కల్పన పనులు నిలిచిపోయాయని విమర్శించారు. గత 45 ఏళ్లలో అత్యధిక నిరుద్యోగాన్ని దేశం ఎదుర్కొంటోంది తెలిపారు. దేశ వ్యాప్తంగా మొత్తం కోట్ల మంది యువత నిరుద్యోగులుగా ఉన్నారు. దీన్ని తొలగించాలంటే ప్రభుత్వాల తీరు మారాలి. నోట్ల రద్దు, జీఎస్టీ వల్ల పర్యాటక రంగానికి నష్టం వాటిల్లిందని ప్రియాంక గాంధీ అన్నారు.

# ఈ సారీ బ్యాంకు ఖాతాల్లోనే

(మొదటిపేజీ తరువాయి)

శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ వెల్లడించారు. జూన్ 1న నగదు బదిలీ ద్వారా 47,74,733 మంది బ్యాంకు ఖాతాలకు పింఛను సొమ్ము జమ చేయనున్నట్లు తెలిపారు. జూన్ ఒకటి నుంచి 5 వరకు ఇంటింటికీ వెళ్లి 17,56,105 మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. ఎన్నికల నియమావళిని పాటిస్తూ పింఛన్లు పంపిణీ చేయాలని ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛను నగదు ఇచ్చే అవకాశం ఉన్నా పింఛన్దారులను ఇళ్ల నుంచి బయటకు రప్పించి ఏప్రిల్ 1న గ్రామ, వార్డు సచివాలయాల్లో పంపిణీ చేసింది. మేలో బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసి వారిని మరింత ఇబ్బందులు పెట్టింది. ఇప్పుడూ అదే విధానాన్ని కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

# దశాబ్ది ఉత్సవాలపై ముమ్మర కసరత్తు

**హైదరాబాద్, మే 29 (ఆంధ్రపత్రిక):** తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు దగ్గర పడుతున్న వేళ ఉత్సవాల నిర్వహణపై ప్రభుత్వం ఏర్పాట్లు ముమ్మరం చేసింది. అలాగే ఉత్సవాలకు ప్రత్యేక అతిథిగా సోనియాను సిఎం రేవంత్ ఆహ్వానించారు. మరోవైపు ముద్రను మార్చాలన్న నిర్ణయంతో పాటు, జజాతీయ గీతం కూడా రూపుదిద్దు కుంటోంది. ఈ క్రమంలో పనులు వేగవంతం చేశారు. తెలంగాణ గీతం, రాజముద్ర ఎంపికపై సీఎం రేవంత్ రెడ్డి కసరత్తు చేస్తున్నారు. ఈ క్రమంలో.. ముఖ్యమంత్రి నివాసానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరయ్యారు. తెలంగాణా గీతం, తెలంగాణ లోగో ఎంపిక పై వారిద్దరూ చర్చించారు. . మరోవైపు.. తెలంగాణ రాష్ట్ర గీతం రూపకల్పన తుది దశకు చేరుకుంది. ఈ క్రమంలో.. గీతం రూపకల్పనపై కవి అందెశ్రీ, సంగీత దర్శకుడు కీరవాణితో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ సమీక్ష చేపట్టారు. సాయంత్రం వరకు పాటకు సంబంధించి పూర్తి స్థాయిలో కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. మరోవైపు.. తెలంగాణ రాజముద్రకు సంబంధించి ఒకట్రెండు రోజుల్లో అధికారికంగా స్పష్టత వచ్చే అవకాశం ఉంది. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా లోగో, గీతాన్ని ప్రభుత్వం అధికారికంగా విడుదల చేయనుంది.

# ఎన్నికల్లో బిజెపిదే విజయం



(మొదటిపేజీ తరువాయి)

రోడ్‌షోలో ప్రజలు చూపిన ఆదరణ ఎన్నటికీ మరిచిపోనని చెప్పారు. “2024 ఎన్నికల్లో కోల్‌కతాలో మీతో పాల్గొంటున్న చివరి సమావేశం ఇది. ఇక్కడి నుంచి ఒడిశా, పంజాబ్ వెళ్తున్నాను. గురువారం సాయంత్రంతో ప్రచారం ముగుస్తుంది. ఇవాళ మీ నుంచి వచ్చిన స్పందన చూస్తుంటే మీ ఆశీస్సులు నావెంటే ఉన్నాయని బలంగా నమ్ముతున్నాను‘ అని ప్రజలను ఉద్దేశించి మోదీ అన్నారు. 'వికసిత్ భారత్' దిశగా ఇండియా పయనం సాగిస్తోందని, అందుకోసం వికసిత్ బెంగాల్ చాలా కీలకమని చెప్పారు. ఇది సాధ్యం కావాలంటే ఇదే విజన్ ఉన్న ఎంపీలను గెలిపించుకోవాలని, త ద్వారా తమకు ఆశీస్సులు అందించాలని ప్రధాని కోరారు. బుజ్జగింపు రాజకీయాల కోసం తృణమూల్ కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగంపై దాడి చేస్తోందని ప్రధాని మండిపడ్డారు. ఓబీసీల హక్కులను ఊడలాక్కుని ముస్లింలకు రిజర్వేషన్ కల్పించాలనుకుంటోందన్నారు. ఓబీసీ సర్టిఫికెట్లను కోల్‌కతా కోర్టు రద్దు చేసిందని, జూన్ 1న వికసిత్ బెంగాల్‌కు ప్రజల ఓట్లే కీలకమని చెప్పారు. బెంగాల్ ప్రజలకు ఉద్దేశించిన అవకాశాలను చొరబాటుదారుల పరం కానున్నాయని మోదీ హెచ్చరించారు. సీఏఏను టీఎంసీ ఎందుకు టీఎంసీ వ్యతిరేకిస్తోందని ప్రశ్నించారు. చొరబాటుదారులకు ఇక్కడ సుస్థిరస్థానం కల్పించాలనే ఆలోచనే ఇందుకు కారణమని మోదీ వివరించారు.

# హైదరాబాద్ చేరుకున్న చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

ఎలా ఉండబోతున్నాయి..? అనేదానిపై ఒకే ఒక్క మాటలో చెప్పేశారు. అమెరికా నుంచి హైదరాబాద్ వచ్చిన చంద్రబాబు.. టీడీపీ ముఖ్యనేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 31న 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ నియోజక వర్గాల చీఫ్ ఎల క్షన్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించ నున్నట్టు చంద్రబాబు తెలిపారు. బుధవారం అమెరికా నుంచి వచ్చీ రాగానే చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వ హించారు. పలు కీలక అంశాలపై సూచనలు చేశారు. జూన్ 1వ తేదీన జోనల్ స్థాయిలో కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ రెండు కార్యక్రమాలకు వెంటనే ఏర్పాట్లు చేయాలని చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. పోస్టల్ బ్యాలెట్‌ల విషయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్‌లపై వెంటనే వైసీపీ చేస్తున్న రాద్ధాంతం పట్ల అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఓటమికి వైసీపీ నేతలు కారణాలు వెతుకుతున్నారని చంద్రబాబు అన్నారు. ఎన్నికల కమిషన్, పోలీసుల తీరుపై అందుకే విమర్శలు చేస్తున్నారని నేతలు చెప్పా రు. కౌంటింగ్ రోజు పూర్తి బందోబస్తు ఏర్పాటు చేయాలని ఈసీకి, డీజీపీకు లేఖ రాయాలని టీడీపీ నిర్ణయం తీసుకున్నారు. ప్రతి అసెంబ్లీ నియో జకవర్గానికి అబ్జర్వర్‌ను నియమించాలని టీడీపీ డిమాండ్ చేసింది. 175 నియోజకవర్గాలకు 120 మంది మాత్రమే పరిశీలకులను నియమించడం పట్ల టీడీపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. వెంటనే అన్ని నియోజకవర్గాలకు పరిశీలకులను నియమించాలని లేఖ రాయాలని చంద్రబాబు నిర్ణయిం చారు. రేపు సాయంత్రం అమరావతికి చంద్రబాబు బయలుదేరనున్నారు.ఇది లావుంటే టిడిపి అధినేత చంద్రబాబు విదేశీ పర్యటనను ముగించుకొని బుధవారం శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చారు. పలువురు టిడిపి నేతలు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. ఎపిలో ఎన్నికల ప్రచారం, పార్టీ వ్యవహారాలతో బిజీగా గడిపిన చంద్రబాబు కొంతకాలం విశ్రాంతి కోసం ఈ నెల 19న విదేశాలకు వెళ్లారు.

# పిల్లల అమ్మకాలపై దర్యాప్తు ముమ్మరం

(మొదటిపేజీ తరువాయి)

ట్రాఫిక్ కేసులో ఇప్పటి వరకు అరెస్టు చేసిన నిందితులు ఇచ్చిన సమాచారంతో మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు. ఈ కేసులో కిరణ్, ప్రీతిదే కీలక పాత్రగా అనుమా నిస్తున్నారు. వాళ్ల కోసం వేట మొదలు పెట్టారు. 50 మందికిపైగా చిన్నారులను విక్రయించినట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. వీరిలో 16 మందిని గుర్తించారు. ఇంకా మిగతా వారి ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో పిల్లల్ని కొనుగోలు చేసిన తల్లిదండ్రులపై కేసులు పెట్టడం ఇక్క మరో ట్విస్టు. దీంతో ఆ ఫ్యామిలీలు బోరున విలపిస్తున్నాయి. తెలిసో తెలియకో పిల్లలు లేరని బెంగతోనో చిన్నారులను కొనుక్కున్నామని వాపోతున్నారు. ఇన్ని రోజులు పెంచుకున్న మమకారంతో వారిని విడిచి పెట్టలేక పోలీస్‌స్టేషన్ వద్దే కన్నీరు మున్నీరుగా విలపించారు. తాము ఆ బిడ్డల్ని కనకపోయినా కడుపులో పెట్టుకొని అంతకంటే ఎక్కువగా పెంచుకున్నామని అంటున్నారు. ప్రాణానికి ప్రాణంగా పెంచుకున్న చిన్నారులను దూరం చేయొద్దని వేడుకుంటున్నారు. సంతానం లేక ఇబ్బంది పడుతున్న ఫ్యామిలీలు పిల్లల కోసం లక్షలు వెచ్చించారు. ఏదో రూపంలో ఇంట్లోకి పిల్లలు వస్తున్నారన్న ఆనందంతో తప్పులు చేస్తున్నారు. పిల్లల్ని ఇలా దత్తత తీసుకోవాలంటే దానికో నియామవళి ఉంది. అప్పుడే అధికారులు దాన్ని గుర్తిస్తారు. ఇలా ఎవరి వద్ద పడిదే వాళ్ల వద్ద కొంటే సమస్యలు కొని తెచ్చుకున్నట్టే. ఇలా పిల్లల్ని కొనుగోలు చేస్తున్న వారిలో చాలా మంది ఆర్థికంగా కూడా అంతంత మాత్రంగానే ఉన్నవాళ్లు ఉన్నారు. ఇలాంటి వాళ్లు కూడా అప్పులు చేసి డబ్బులు చెల్లించి పిల్లల్ని కొంటున్నారు. ఇలాంటి ముఠాల్లో ఆర్ఎంపీలు, ఆసుపత్రుల్లో పని చేసే సిబ్బంది పాత్ర ఎక్కువగా ఉంటోంది. ఇప్పుడు వెలుగులోకి వచ్చిన కేసులో కూడా నిందితులుగా ఆరఎంపీలు, ఇతర ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

# చైనాలో కొత్త వైరస్

(మొదటిపేజీ తరువాయి)

సంతరించుకుంది. ప్రపంచ దేశాలను ఉలిక్కిపడేలా చేసింది. దీని పేరు– వెసిక్యులర్ స్టొమాటైటిస్ వైరస్. హెబెయ్ మెడికల్ యూనివర్శిటీ సైంటిస్టులు దీన్ని సృష్టించారు. ఇదొక సింథటిక్ వైరస్. శరీరంలోకి ప్రవేశించిన మూడు రోజుల్లోనే ప్రాణాలను తినేస్తుంది ఈ క్రిమి. గతంలో ఆఫ్రికన్ దేశాలను వణికించిన ఎబోలా వైరస్‌ను పోలి ఉంటుంది. దాని జన్యుక్రమాన్ని అంచనా వేయడంలో భాగంగా దీనికి ప్రాణం పోశారు. ఎబోలా వైరస్‌లో ఉండే గ్లైకొప్రొటీన్‌ను ఉపయోగించిన వెసిక్యులర్ స్టొమాటైటిస్‌ను కనుగొన్నారు. మనిషి శరీరంలో ప్రవేశించిన తరువాత కణాల వ్యవస్థను ఇది ధ్వంసం చేసి పడేస్తుంది. దాదాపుగా అవయవాలన్నింటికీ సోకుతుంది. వాటి పనితీరును దెబ్బతీస్తుంది. ఫలితంగా 72 గంటల్లో ప్రాణం పోయేలా చేయగలుగుతుంది. ఈ వైరస్‌ను తొలుత 10 సిరియన్ హ్యామ్‌స్టర్స్ అంటే చిట్టెలుకలపై ప్రయోగించారు. ఇందులో అయిదు చొప్పున మగ, ఆడ చిట్టెలుకలు ఉన్నాయి. ఈ వైరస్‌ను వాటిల్లో ఇంజెక్ట్ చేసిన వెంటనే అవన్నీ కూడా దశలవారీగా మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్స్‌కు గురయ్యాయి. మూడు రోజుల్లో మరణించాయి. ఎబోలా వైరస్ సోకిన మనిషి.. ఎలాంటి అనారోగ్యానికి గురవుతాడు? దాన్ని నివారించడానికి ఎలాంటి మెడిసిన్‌ను ఉపయోగించాల్సి ఉంటుంది? అనే విషయంపై చేసిన ప్రయోగంలో భాగంగా వెసిక్యులర్ స్టొమాటైటిస్‌ను సృష్టించాల్సి వచ్చిందని సైన్స్ డైరెక్ట్ మేగజైన్ వెల్లడించింది. ఎబోలా వైరస్ కూడా ఇంతే. దీని పనితీరును ఖచ్చితంగా అధ్యయనం చేయడానికి, విరుగుడుగా యాంటీ వైరస్‌ను తయారు చేయాలనే ఉద్దేశంతో హెబే మెడికల్ యూనివర్శిటీ సైంటిస్టులు ఈ కొత్త వైరస్‌ను సృష్టించారు. ఇది గనక బయటికి వస్తే కరోనా కంటే కూడా అత్యంత ప్రమాదకరంగా మారుతుందని సైన్స్ డైరెక్ట్ అభిప్రాయపడింది.

# కేజ్రీవాల్‌కు సుప్రీంలో చుక్కెదురు

(మొదటిపేజీ తరువాయి)

బెయిల్‌ను పొడిగించాలని పిటిషన్ దాఖలు చేయగా దానిని కోర్టు తిరస్కరించింది. కేజ్రివాల్ దరఖాస్తును స్వీకరిం చేందుకు కోర్టు రిజిస్ట్రీ నిరాకరించింది. రెగ్యులర్ బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లే స్వేచ్ఛ కేజ్రీవాల్‌కు ఇచ్చింది. కేజ్రీవాల్ దరఖాస్తు విచారణకు అర్హమైనది కాదు. ఇప్పుడు సీఎం కేజ్రివాల్ జూన్ 2న లొంగిపోవాల్సి ఉంటుంది. మే 10న జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేశారు. జూన్ 2న తీహార్ జైలులో లొంగిపోవాలని కోరారు. మే 17న పీఎంఎల్ఏ కేసులో అతని అరెస్టు చట్టబద్ధత పై సవాలు చేస్తూ ఈడీపై ధర్మాసనం తన తీర్పును రిజర్వ్ చేసింది. మంగళవారం, సుప్రీంకోర్టులోని మరో బెంచ్ కూడా కేజ్రివాల్ పిటిషన్‌ను విచారించడానికి నిరాకరించింది. సీజేఐ డీవై చంద్రచూడ్‌ను సంప్రదించాలని కోరింది. అరవింద్ కేజ్రీవాల్ అకస్మాత్తుగా ఆరేడు కిలోల బరువు తగ్గినందున అనేక వైద్య పరీక్షలు చేయించుకోవడానికి మధ్యంతర బెయిల్ వ్యవ ధిని ఏడు రోజులు పొడిగించాలని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. తిరిగి జైలుకు వెళ్లేందుకు కోర్టు నిర్దేశించిన జూన్ 2న కాకుండా జూన్ 9న లొంగిపోవాలని కేజ్రీవాల్ మే 26న దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు.అతని బరువు ఆరేడు కిలోల వరకు తగ్గిందని, అతని కీటోన్ స్థాయి చాలా ఎక్కువగా ఉందని, ఇది తీవ్రమైన కిడ్నీ, గుండె జబ్బులు, క్యాన్సర్‌కు కూడా సూచిక అని పిటిషన్‌లో పేర్కొంది. సీటీ స్కాన్‌తో పాటు వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు.

# ఎపి ఎన్నికల కౌంటింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు

(మొదటిపేజీ తరువాయి)

వద్ద 144 సెక్షన్ విధించి, బలగాలను పహారా పెడుతున్నారు. మూడు రోజులపాటు మద్యం అమ్మకాలపై ఆంక్షలు విధించారు. విజయోత్సవాలను నిషేధించారు. ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సెంట్రలైజ్డ్ కంట్రోల్ రూము అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఇప్పటికే అధికారులకు సూచించారు. జూన్ 4న చేపట్టనున్న ఓట్ల లెక్కింపుకు సంబంధించిన ఏర్పాట్లను ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తాలు సమీక్షించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. కౌంటింగ్ ప్రక్రియ చేపట్టేందుకు చేసిన, చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఎన్నికల అధికారులు కోరారు. కౌంటింగ్‌కు వచ్చే ఆయా పార్టీల ఏజెంట్లు ముందస్తుగానే పాసులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కౌంటింగ్ వచ్చే అభ్యర్థులు, ఏజెంట్లు వాహనాలను కౌంటింగ్ కేంద్రం వద్దకు అనుమతించేందుకు ముందస్తుగానే పాస్లు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతిచ్చేది లేదన్నారు. అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిర్వహించేందుకు చేపట్టిన చర్యలను వివరించారు. ఈసారి భారీగా కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు తదితరులతోపాటు ఇతర సిబ్బంది కౌంటింగ్ ప్రక్రియ అనుబంధ విధుల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని సూక్ష్మ పరిశీలన, సీసీ కెమెరాల నిఘా మధ్య ప్రక్రియను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎక్కడా ఎలాంటి గందరగోళానికి తావులేకుండా సరైన విధంగా బ్యారికేడింగ్, సూచిక బోర్డులు ఏర్పాటు, వాహనాల పార్కింగ్, మీడియా కేంద్రం ఏర్పాటు, రౌండ్ల వారీగా ఫలితాల వెల్లడి ప్రణాళిక, అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లకు అవసరమైన ఏర్పాట్లు, మార్గదర్శకాల మేరకు కౌంటింగ్ టేబుళ్ల ఏర్పాటు తదితర అంశాలను వివరించారు. కౌంటింగ్ రోజు, ఆ తరువాత ఎంత వరకు అవసరమో అంతవరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఒకరు గెలిస్తే మరొకరు ఓడతారని, గొడవలు చేసినంత మాత్రాన ఫలితాలు తారుమారు కావన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. ఓట్ల లెక్కింపు అనంతరం ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించేంత వరకు అభ్యర్థుల ఏజెంట్లు అందుబాటులో ఉండాలన్నారు. ఫలితాలు వెలువడిన అనంతరం గెలిచిన, ఓటమి పాలైన అభ్యర్థులు, వారి ప్రతినిధులు శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఫలితాలు వెలువడిన తరువాత ఊరేగింపులు, డీజేలకు, ర్యాలీలకు అనుమతులు లేవన్నారు.రౌండ్ల వారీగా ఓట్లు లెక్కింపు చేపట్టి జాప్యం లేకుండా ఫలితాల వెల్లడికి చర్యలు తీసుకుంటున్నట్లు సీఈఓ మీనా తెలిపారు. కౌంటింగ్ సెంటర్‌లో, సెంటర్ బయట జరిగేటప్పుడు అవాంచనీయ సంఘటనలు సంబంధిత రిటర్నింగ్ అధికారి వెంటనే స్పందించాలని తెలిపారు. అలాగే పోలింగ్ రోజున ఈవీఎంలు ధ్వంసం చేసిన కేసులలో ఉన్న వారిని, పోలింగ్ ముందు రోజు, పోలింగ్ తర్వాత రోజున హింసాత్మక ఘటనలలో పాల్గొన్న వారిని కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించవద్దని మీనా సూచించారు. డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ.. ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా జూన్ 3, 4, 5 తేదీలలో మద్యం అమ్మకాలు నిషేధించినట్లు చెప్పారు. ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలను పరిశీలించాలన్నారు. జిల్లాలోని అన్ని హోటళ్లు, లాడ్జీల్లో ముమ్మర తనిఖీలు చేసి అనుమానితులను అదుపులోకి తీసుకోవాలని డీజీపీ సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఓట్లలెక్కింపు కేంద్రంవద్దకు ఎలాంటి ఆయుధాలతో రాకూడదన్నారు.

# పోస్టల్ బ్యాలెట్‌పై సడలింపు

**విశాఖపట్నం, మే 29 (ఆంధ్రపత్రిక):** పోస్టల్ బ్యాలెట్‌లో గెజిటెడ్ సంతకం సడలింపుపై హైకోర్టుకు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నామని వైఎస్సార్‌సీపీ నేత వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఈసీ వ్యవహారశ్కెలిని హైకోర్టులో తేల్చుకోనున్నామన్నారు. దేశం అంతటా ఒక రకమైన నిబంధనలు ఉంటే ఏపీలో ఈసీ ప్రత్యేక రూల్స్ చెబుతోంది. పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్ ఫారంపై గెజిటెడ్ సంతకం లేకుంటే దానిని తిరస్కరించడం నిబంధన. కానీ ఏపీలో మాత్రం గెజిటెడ్ సంతకం లేకపోయినా అనుమతించడంపై సీఈసీకి ఫిర్యాదు చేశామని వైవీ అన్నారు. సీఈసీ స్పందించకపోతే హైకోర్టుకు వెళ్తామని వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు.

# నరసన్నను దర్శించిన రాష్ట్ర మంత్రి వేణు



**కోరుకొండ, మే 29 (ఆంధ్రపత్రిక) :** రాష్ట్ర సమాచార ప్రసార శాఖ, బలహీనవర్గాల సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీ వేణుగోపాలకృష్ణ బుధవారం సాయంత్రం కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించారు. ఆయన కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని రాష్ట్ర మంత్రిగా పలు సందర్భాల్లో దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిరాడంబరంగా ఆలయాన్ని దర్శించి, మంత్రి వేణు కోరుకొండ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అర్చక స్వాముల ఆశీర్వచనం తీసుకున్నారు.

# కవితపై ఈడి ఛార్జిషీట్‌ను పరిగణించిన కోర్టు



**న్యూఢిల్లీ,మే 29 :** ఎక్సైజ్ పాలసీతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు మరో ఎదురు దెబ్బ తగిలింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన అనుబంధ ఛార్జిషీట్‌ను రౌస్ అవెన్యూ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. కవితపై దాఖలైన చార్జి షీట్ ను రౌస్ అవెన్యూ కోర్టు పరిగణలోకి తీసుంది. అలాగే జూన్ 3న చార్జిషీట్ లో పేర్కొన్న నిందితులందరూ కోర్టు ఎందటు హాజరు కావాలని సమన్లు జారీ చేసింది. దీంతో వచ్చే నెల 3న కవితను జైలు అధికారులు కోర్టులో ప్రవేశపెట్టున్నారు. కాగా ఈడీ, సీబీఐ కేర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా తన వద్ద విచారణకు తగిన సాక్ష్యాలు ఉన్నాయని ఈడీ చేసిన వాదనను పరిగణనలోకి తీసుకున్న తర్వాత ఉత్తర్వులను రిజర్వ్ చేశారు. తాజాగా ఇవాళ ఈడీ చార్జిషీట్ ను పరిగణలోకి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. మరో వైపు కవిత బెయిల్ పిటిషన్లపై నిన్న ఢిల్లీ హైకోర్టులో వాదనలు పూర్తయ్యాయి. ఇరువైపుల వాదనలు విన్న హైకోర్డు జడ్జి స్వర్ణకాంత శర్మ తీర్పును రిజర్వు చేశారు. ఈ క్రమంలో రౌస్ అవెన్యూ కోర్టు మాత్రం ఈడీ దాఖలు చేసిన అనుబంధ చార్జిషీట్ ను పరిగణలోకి తీసుకుని ఇందులో నిందితులుగా ఉన్న వారందరిని విచారణకు పిలవడం హాట్ టాపిక్ గా మారింది.

# కౌంటింగ్‌కు పూర్తిస్థాయిలో సన్నద్ధం

- ప్రశాంత వాతావరణంలో సాఫీగా ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.డిల్లీరావు



**విజయవాడ, మే 29 (ఆంధ్రపత్రిక):** ఎన్‌టీఆర్ జిల్లా పరిధిలోని విజయవాడ పార్లమెంటరీ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును జూన్ 4న ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉన్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్ నుంచి బుధవారం సాధారణ ఎన్నికలు-2024 కౌంటింగ్ సన్నద్ధతపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, నియోజకవర్గాల ఆర్‌వోలు, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈసీఐ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ సమీక్ష నిర్వహించారు. ఈ వీసీకి కలెక్టరేట్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ డిల్లీరావు.. జాయింట్ కలెక్టర్, మైలవరం ఆర్‌వో పి.సంపత్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్, విజయవాడ సెంట్రల్ ఆర్‌వో స్వప్నిల్ దినకర్ పుండ్కర్, రిటర్నింగ్ అధికారులతో కలిసి హాజరయ్యారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఓట్ల లెక్కింపును చేపట్టి వేగంగా, కచ్చితత్వంతో ఫలితాల ప్రకటనకు, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకున్న చర్యలపై సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ సమీక్షించి.. కౌంటింగ్‌కు సంబంధించి ప్రతిదశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మార్గనిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డిల్లీరావు.. జిల్లాకు సంబంధించి ఇబ్రహీంపట్నం మండలం, జూపూడి గ్రామ పరిధిలోని నోవా, నిమ్రా కళాశాల్లోని కౌంటింగ్ కేంద్రాల్లో ఈవీఎం కౌంటింగ్ గదులు, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ గదుల్లో చేసిన ఏర్పాట్లను వివరించారు. కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లను తెలియజేసేందుకు ఇప్పటికే రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఎక్కడా ఎలాంటి గందరగోళానికి తావులేకుండా బ్యారికేడింగ్, పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. శాంతియుత వాతావరణంలో కౌంటింగ్ జరిగేలా భద్రత, బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మీడియా సెంటర్ ఏర్పాటుతో పాటు రౌండ్ల వారీగా ఫలితాల వెల్లడికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సిస్టమ్స్‌తో పాటు హైస్పీడ్ ఇంటర్నెట్ ఏర్పాటుతో పాటు ఎన్‌కోర్‌లో డేటా ఎంట్రీకి తగిన చర్యలు తీసుకున్నామన్నారు. విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంలో నమోదైన ఓట్ల లెక్కింపునకు ఒక్కో నియోజకవర్గానికి 14 టేబుళ్లు చొప్పున మొత్తం 98 టేబుళ్లు ఏర్పాటు చేశామని.. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి మొత్తం 132 రౌండ్లలో లెక్కింపు జరగనుందన్నారు.ఇదే విధంగా అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఓట్ల లెక్కింపు సాఫీగా జరిగేలా కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు తదితర మానవ వనరులకు నాణ్యమైన శిక్షణ ఇవ్వడం జరిగిందని కలెక్టర్ డిల్లీరావు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌కు విజయవాడ తూర్పు ఆర్‌వో బీహెచ్ భవానీ శంకర్, తిరువూరు ఆర్‌వో కె.మాధవి, నందిగామ ఆర్‌వో ఎ.రవీంద్రరావు, జగ్గయ్యపేట ఆర్‌వో జి.వెంకటేశ్వర్లు, విజయవాడ పశ్చిమ ఆర్‌వో ఇ.కిరణ్మయి తదితరులు హాజరయ్యారు.

# నిడమర్రులో ఎస్ఆర్ఎం ఉచిత ట్యూషన్ సెంటర్



**అమరావతి, మే 29(ఆంధ్రపత్రిక):** మంగళగిరి మండలం నిడమర్రు గ్రామంలో బుధవారం ఉదయం ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఉచిత ట్యూషన్ సెంటర్ ప్రారంభమైంది. ఏపీ ఎస్ఆర్ ఎం యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్కుమార్, స్టూడెంట్ అఫైర్స్ డిపార్ట్మెంట్ అసోసియేట్ డైరెక్టర్ రేవతి బాలక్రిష్ణన్‌లు సంయుక్తంగా ఈ సెంటర్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్ కుమార్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగించారు. బోధన, పరిశోధనల్లో అగ్రగామి విద్యానిలయంగా అంతర్జాతీయ స్థాయిలో పేరు గడించిన ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి చెందిన ఎస్ఆర్ఎం ఫౌండేషన్ (చెన్నై) తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోందన్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లో ఉచిత విద్య, మహిళాభివృద్ధి, రోడ్డుభద్రత, మహిళా వికాసం కోసం ప్రత్యేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని వివరించారు. ఇందులో భాగంగా మంగళగిరి మండలం నిడమర్రు గ్రామంలో ఉచిత ట్యూషన్ సెంటర్ను ప్రారంభించడం జరిగిందన్నా రు. గ్రామీణ ప్రాంతంలో నివసించే విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించే లక్ష్యంతో మొట్టమొదటి గ్రామీణ ట్యూషన్ సెంటర్ను ఏర్పాటు చేయడం జరిగిందని ఫౌండేషన్ ప్రతినిధి సురేశ్ కన్నన్ పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్రంలో ఇప్పటి వరకూ 22 ట్యూషన్ సెంటర్లను నెలకొల్పి 570 మంది విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన జరుగుతుందని యూనివర్సిటీ మీడియా పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్ వేణుగోపాల్ గంగిశెట్టి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్లో ఏర్పాటు చేసిన మొట్టమొదటి ఉచిత ట్యూషన్ సెంటర్ ఇదేనన్నారు. ఆరవ తరగతి నుంచి పదవ తరగతి చదివే పేద విద్యార్థులకు ఇక్కడ ఉచితంగా పాఠ్యాంశాలను బోధించడం జరుగుతుందని 'పుతియ తలై ముఱై ఫౌండేషన్' సీనియర్ కన్సల్టెంట్ ఎలమరన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు భవిష్యత్తులో తాము డాక్టర్లు, ఇంజినీర్లుగా ఎదుగుతామని పేర్కొన్నారు. నిడమర్రులో తొలి ట్యూషన్ సెంటర్ను ఏర్పాటు చేయడమే కాకుండా తనకు బోధించే అవకాశం కల్పించిన ఎస్ఆర్ ఎం ఫౌండేషన్కు ట్యూషన్ సెంటర్ ఉపాధ్యాయురాలు ప్రత్తిపాటి సుష్మ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ చీఫ్ లయజన్ ఆఫీసర్ పూళ్ల రమేష్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ రామచంద్రారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.






## మహారాజా చిత్రంలో సేతుపతి

పాన్ ఇండియా స్టార్ ఇమేజ్ ఉన్న తమిళ నటుల్లో టాప్‌లో ఉంటాడు విజయ్ సేతుపతి. తమిళం, హిందీ, కన్నడ, మలయాళం, తెలుగు భాల్లో ఓ వైపు హీరోగా.. మరోవైపు నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రల్లో నటిస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తున్నాడు. ఈ స్టార్ యాక్టర్ నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి మక్కళ్ సెల్వన్ 50 నితిలన్ సామినాథన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి మహారాజా టైటిల్‌తో వస్తోంది. తాజాగా ట్రైలర్ అప్‌డేట్ అందించింది మక్కళ్ సెల్వన్ టీం. నిరీక్షణ దాదాపు ముగిసిపోయింది. మహారాజా ట్రైలర్ రేపు సాయంత్రం 5 గంటలకు రాబోతుందని మేకర్స్ కొత్త పోస్టర్ ఒకటి షేర్ చేశారు మేకర్స్. ముఖంపై గాట్లతో ఉన్న విజయ్ సేతుపతి చేతిలో కత్తి పట్టుకొని స్టన్నింగ్‌గా కనిపిస్తూ సినిమా ట్రైలర్‌పై క్యూరియాసిటీ పెంచేస్తున్నాడు. ఇప్పటికే లాంచ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో రక్తపు మరకలతో ఉన్న విజయ్ సేతుపతి చేతిలో కత్తి పట్టుకొని హెయిర్ సెలూన్ ఛైర్‌పై కూర్చున్నాడు. చెవికి పట్టీ కనిపిస్తుండగా.. పక్కనే పోలీసులు కూడా ఉన్నారు. అసలు ఏం జరిగిందనేది సస్పెన్స్‌లో పెట్టేసి సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాడు డైరెక్టర్. ప్యాషన్ స్టూడియోస్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ మూవీలో బాలీవుడ్ దర్శకనిర్మాత అనురాగ్ కశ్యప్, మమతా మోహన్ దాస్, నట్టీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాంతార ఫేం అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు.




## పుష్ప-2: సూసేకి అగ్గిరవ్వ పాట విడుదల

అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న భారీ సీక్వెల్ 'పుష్ప 2' ఆగస్టు 15న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రంలోని తొలిపాట విడుదలై ఇప్పటికే రికార్డులు సృష్టిస్తుండగా.. ఇప్పుడు రెండో సాంగ్ కూడా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. 'సూసేకి అగ్గిరవ్వ మాదిరి ఉంటాడే నా సామి..' అంటూ సాగే కపుల్ సాంగ్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. పుష్ప.. పుష్పరాజ్ .. నీయవ్వ తగ్గేదే లే' అంటూ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ గడ్డం కింద చెయ్యి పెట్టి అడ్డంగా తిప్పితే.. వరల్డే షేకయింది. పుష్ప అంటే ఫ్లవర్ అనుకుంటివా.. ఫైర్' అంటే స్టార్స్ అందరూ ఫైర్ లెక్క ఫీలయ్యారు. ఇప్పుడు 'పుష్ప'కు కంటిన్యూగా రాబోతోన్న 'పుష్ప 2: ది రూల్'పై ఆకాశమే అవధి అన్నట్లుగా అంచనా లున్నాయంటే.. 'పుష్ప' ఎలా ప్రేక్షక హృదయాలను దోచుకున్నాడో అర్థం చేసుకోవచ్చు.



## కెరీర్‌పై దృష్టి పెట్టాను

బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ పెళ్లి వార్తలు సోషల్ మీడియాలో తరచూ చక్కర్లు కొడుతున్నాయి. తాజాగా వీటిపై ఆమె స్పందించారు. 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' ప్రమోషన్స్‌లో భాగంగా ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పెళ్లిపై వచ్చిన రూమర్స్‌కు చెక్ పెట్టారు. 'ఇటీవల నా పెళ్లికి సంబంధించిన వార్తలు కొన్ని చదివాను. త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నట్లు రాశారు. పలు ఇంటర్వ్యూల్లో చెప్పిన రెండు, మూడు కథనాలు మిక్స్ చేసి అలా రాశారు.నాకు తెలియకుండానే వారంలో పెళ్లి కూడా చేసేలా ఉన్నారు. నేను ప్రస్తుతం కెరీర్‌పై దృష్టి పెట్టాలనుకుంటున్నా' అని చెప్పారు. దీంతో ఈ వార్తలకు చెక్ పడినట్లు అయింది. ఇక ఇటీవల జాన్వీ పెళ్లిపై ఓ నెటిజన్ పోస్ట్ పెట్టగా.. దానికి ఆమె రియాక్ట్ అయ్యారు. 'ఏదైనా రాస్తారా..' అని రిప్లై పెట్టారు. మరోవైపు జాన్వీ తాజాగా సోషల్ మీడియా వెబ్‌సైట్ రెడిట్‌లో యూజర్లతో చిట్‌చాట్ చేశారు. ఇందులో ఓ అభిమాని అడిగిన ప్రశ్నకు ఆమె ఇచ్చిన ఫన్నీ రిప్లై వైరల్‌గా మారింది. 'మనం డేట్‌కు వెళ్దామా? అది మంచి స్టోరీ అవుతుంది' అని ఓ యూజర్ అడగ్గా దానికి జాన్వీ సరదాగా స్పందించారు. 'నువ్వు గొడ్డలితో నరికి చంపేసే హంతకుడివి అయితే ఎలా?' అన్నారు.



## పుష్ప-2లో తృప్తి డిమ్రీతో ఐటమ్ సాంగ్



పుష్ప-2 చిత్రం విడుదలకు ముందే అనేక సంచలనాలు వస్తున్నాయి. ఈ చిత్రంలో పాటలు శ్రేయాఘోషాలు పాడగా..ఐటమ్ సాంగ్ కోసం తృప్తి డిమ్రిని తీసుకుని వచ్చే ప్రయటత్నాలు సాగుతున్నాయని సమాచారం. మరో విశేషమేమంటే పార్ట్-3 కూడా ప్లాన్ చేస్తున్నారని టాక్. ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్, సుకుమార్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం 'పుష్ప 2'.. గతంలో బ్లాక్ బస్టర్ హిట్ అయిన 'పుష్ప' సినిమాకు సీక్వెల్‌గా ఈ సినిమా తెరకెక్కుతుంది. మైత్రి మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోన్న ఈ చిత్రాన్ని ఆగస్ట్ 15న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. పుష్ప 3కి సంబంధించి సమాచారం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అలాగే ఈ సినిమాలో అదిరిపోయే ఐటెం సాంగ్ కూడా ప్లాన చేస్తున్నారని టాక్ నడుస్తోంది. యానిమల్ బ్యూటీ తృప్తి డిమ్రి ఈ సాంగ్‌లో ఆడిపాడనున్నారని వార్తలు వస్తున్నాయి. త్వరలోనే సుకుమార్ ఈ పాటను కూడా షూట్ చేసే అవకాశం ఉంది. అయితే పుష్ప-3 కూడా ఉంటుందని చాలాకాలంగా టాక్ నడుస్తోంది. తాజాగా సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు దాని గురించే అని టాక్. అల్లు అర్జున సరసన రష్మిక నటిస్తోంది.

## మహారాణిగా కాజోల్



బాలీ వుడ్ నటి కాజోల్ కీలక పాత్రలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'మహారాజ్ఞి'.చరణ్‌తేజ్ ఉప్పల పాటి దర్శకుడు. ప్రభుదేవా, సంయుక్త, నసీరుద్దీషా, జిషుసేన్ గుప్త, ఆదిత్య సీల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మంగళవారం ఈ చిత్ర టీజర్ విడుదలైంది. సినిమాకు సంబంధించిన పాత్రలను పరిచయం చేస్తూ విడుదల చేసిన ఈ టీజర్‌లో కాజోల్ యాక్షన్‌తో అదరగొట్టారు. హిందీతో పాటు, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది.

## త్వరలోనే మోక్షజ్ఞ ఎంట్రీ



మోక్షజ్ఞ ఎంట్రీ త్వరలోనే ఉండబోతుందంటూ క్లారిటీ ఇచ్చాడు బాలకృష్ణ. విశ్వక్‌సేన్ నటిస్తున్న గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు బాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యాడని తెలిసిందే. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ..ఇండస్ట్రీకి త్వరలోనే మోక్షజ్ఞ ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. విశ్వక్‌సేన్, సిద్దు జొన్నలగడ్డ, అడివిశేష్ లాంటి యాక్టర్లను స్ఫూర్తిగా తీసుకోవాలని నేనెప్పుడూ మోక్షజ్ఞకు చెప్తుంటా. ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా నవతరం కథలను అందించేలా యాక్టర్లు తమను తాము మార్చుకోవాలని సూచించారు.

## ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా పాలిసెట్ అడ్మిషన్ల షెడ్యూల్‌లో మార్పులు

- సాంకేతిక విద్యా శాఖ కమీషనర్ చదలవాడ నాగరాణి
- జూన్ 7 నుండి 10 వరకు ఐచ్చికాల నమోదుకు అవకాశం
- జూన్ 13వ తేదీన సీట్ల కేటాయింపు, 14 నుండి తరగతులు ప్రారంభం



**విజయవాడ, మే 29 (ఆంధ్రపత్రిక):** సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్, జూన్ మొదటి వారంలో రాష్ట్ర వ్యాప్తంగా మూడు రోజుల పాటు 144 సెక్షన్ విధింపు కారణంగా విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఉండేలా పాలిసె ట్ 2024 అడ్మిషన్ల ప్రక్రియలో మార్పులు చేసినట్లు సాంకేతిక విద్యా శాఖ కమీషనర్, సాంకేతిక విద్య, శిక్షణా మండలి ఛైర్మన్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఇందుకు సంబంధించిన సవరణ నోటిఫికేషన్‌ను బుధవారం విడుదల చేసారు. అమరావతిలోని రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కార్యాల యంలో పాలిసెట్ ప్రవేశాలకు సంబంధించి నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో విభిన్న అంశాలను చర్చించి, విద్యార్థులు, వారి తల్లి దండ్రుల నుండి వచ్చిన వినతుల మేరకు అవసరమైన తుది షెడ్యూలును ఖరారు చేసినట్లు నాగరాణి వివరించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ ప్రవేశాలకు సంబంధించిన ఫీజు చెల్లింపు, ధృవపత్రాల వెరిఫికేషన్ తదితరు ఆన్ లైన్ ప్రక్రియ తేదీలలో ఎటువంటి మార్పు లేదని, జూన్ 2వ తేదీ వరకు అవకాశం ఉంటుందన్నారు. 3వ తేదీన ఉన్న ధృవపత్రాల వెరిఫికేషన్ 6వ తేదీన నిర్వహిసామని, ప్రత్యేక క్యాటగిరి అభ్యర్థులకు సైతం ఇదే వర్తిస్తుందని పేర్కొన్నారు. జూన్ 7 నుండి 10 వరకు ఐచ్ఛికాల నమోదుకు అవకాశం ఉంటుందన్నారు. జూన్ 11వ తేదీన ఐచ్ఛికాల మార్పుకు అవకాశం ఉంటుందన్నారు. జూన్ 13వ తేదీన సీట్ల కేటాయింపును పూర్తి చేస్తామని కమీషనర్ వివరించారు. జూన్ 14 నుండి 19వ తేదీ వరకు 6 రోజుల లోపు ప్రవేశాలు ఖరారు అయిన విద్యార్థులు అయా పాలిటెక్నిక్‌లలో వ్యక్తిగతంగా, ఆన్ లైన్ విధానంలోనూ రిపోర్టు చేయవలసి ఉంటుందన్నారు. జూన్ 14వ తేదీ నుండే రాష్ట్ర వ్యాప్తంగా తరగతులు ప్రారంభం అవుతాయని నాగరాణి పేర్కొన్నారు. ర్యాంకు కార్డులను వెబ్ సైట్ నుండి డౌన్ లోడ్ చేసుకోవచ్చని, ప్రవేశాల కౌన్సిలింగ్ కు సిద్దంగా ఉండాలన్నారు. మొత్తం 1,42,035 మంది విద్యార్థులు పాలిసెట్ ప్రవేశ పరీక్షకు హాజరుకాగా, 87.61 శాతం మేర 1,24,430 మంది అర్హత పొందారు. బాలికలు 56,464 మంది పరీక్షకు హాజరుకాగా, 89.81 శాతం మంది, బాలురలో 85,561 మంది హాజరుకాగా 86.16 శాతం అర్హత గడించారు. సమావేశంలో సాంకేతిక విద్య శాఖ సంయిక్త సంచాలకులు వెలగా పద్మారావు, రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి కార్యదర్శి రమణబాబు, చీఫ్ క్యాంప్ ఆఫీసర్ విజయకుమార్, ఉపసంచాలకులు విజయ బాస్కర్ పాల్గొన్నారు.



విజయవాడలో దక్షిణ భారత ఉత్సవ్ 2024 లోగోను విడుదల చేస్తున్న దక్షిణ భారత ఉత్సవ్ చీఫ్ కోఆర్డినేటర్లు, జికె.శెట్టి, బివి.గోపాల్ రెడ్డి, కె.శివ షణ్ముగం, ఎపి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు మరియు సభ్యులు.

ఆంధ్రపత్రిక ఫోటోలు: సిహెచ్.విజయభాస్కర్



Printed and Published by KANCHARLA RAMAIAH on behalf of Nageswara Rao Estates Private Limited,Printed at Jagati Publications Limited, Sakshi Press, SY.No.481, Phase-2, Jawahar Autonagar, Vijayawada-520007 Andhra Pradesh, and Published from D.NO.29-28-34, Dasari vari street, Suryaraopeta,Vijayawada-520002, KRISHNA DISTRICT-ANDHRA PRADESH, Editor : KANCHARLA RAMAIAH. Excutive editor V.VIJAYALAKSHMI. RNI no. 10721/65 Mobile:9849998069, Email:andhrapatrikadaily@gmail.com